
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.2
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 18 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	52,157	52,157
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.28 (4.27)	2,872.91	2,502.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.751 (43.8403)	38,900	37,734

చికెన్ ధరలు | లైవ్: రూ.139 | డ్రెస్: రూ.220 | స్కిన్‌లెస్: రూ.240



ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిశ్వరంజన్ మహంతి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి.

రాజకీయంగా రాష్ట్రస్థాయి ప్రాధాన్యం కలిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కీలక నేతలు ఈ పదవిని ఆశిస్తూ ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. పీసీసీ కార్యవర్గంలో స్థానం లభించిన నేతలు డీసీసీ పదవికి పోటీపడుతూ దరఖాస్తు చేయడం, రాజకీయంగా ఉద్దండులు ఉన్న జిల్లా కావడంతో అందరినీ సమన్వయం చేసే సమర్థత కలిగిన నేతకు బాధ్యతలు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

డీసీసీ పదవిపై.. ఉత్కంఠ

- సమర్థత, సమన్వయం, సీనియార్టీ వైపే క్యాడర్ మొగ్గు
- గుమ్ముల మోహన్‌రెడ్డి వైపే అందరి చూపు
- కొండేటి, పున్నా కైలాష్, దయాకర్‌గౌడ్ తీవ్ర ప్రయత్నాలు

రానున్న రోజుల్లో డీసీసీలే పార్టీకి సుప్రీం అని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు అనుగుణంగానే అధ్యక్ష పదవికి గతంలో మాదిరిగా నామినేట్ చేయకుండా, క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు సేకరిస్తోంది. అధ్యక్షుడి ఎంపికపై ఎవరి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఏఐసీసీ బాధ్యులను ఈ ప్రక్రియకు పరిశీలకులుగా నియమించింది. జిల్లాలోనూ ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిశ్వరంజన్ మహంతి వారం రోజులుగా సహాయ పరిశీలకులతో కలిసి జిల్లాలో మకాం వేసి అన్ని బ్లాక్‌స్థాయి సమావేశాల్లో పాల్గొని అభిప్రాయసేకరణ చేశారు. గతానికి భిన్నంగా అధిష్ఠానం భారీ కసరత్తు చేస్తుండగా, మరోవైపు పదవి ఆశించే నేతల బలమైన ప్రయత్నాల నేపథ్యంలో ఈ దఫా పదవి ఎవరిని వరిస్తుందనే అంశంపై పార్టీ క్యాడర్‌లో ఆసక్తి కొనసాగుతోంది.

సమర్థత, సమన్వయశక్తి, సీనియార్టీకే క్యాడర్ జై

అత్యంత కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలనే అంశంపై బ్లాక్‌స్థాయిల్లో జరిగిన సమావేశాల్లో విస్తృతస్థాయిలో అభిప్రాయాలు సేకరించారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకున్న ఏఐసీసీ పరిశీలకులు క్యాడర్ మనోగతాన్ని సైతం నమోదు చేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కీలక నేతలు సైతం వారి సూచనలను ఏఐసీసీ పరిశీలకులకు తెలియజేశారు. భిన్నమైన రాజకీయ వాతావరణం, రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా కావడం, రాష్ట్ర స్థాయి కీలక నేతలు కలిగిన ఈ జిల్లాలో పార్టీని నడిపే సామర్థ్యం, సీనియర్లు, జూనియర్లనే భేదాల్లేకుండా అందరినీ సమన్వయం చేసే నేతకే పదవి ఇవ్వాలనే బలమైన అభిప్రాయం క్యాడర్ నుంచి వెల్లడైంది. ప్రధానంగా జిల్లా కేంద్రంలో ఉంటూ క్యాడర్‌కు నిత్యం అందుబాటులో ఉండే నేతకు అవకాశం ఇవ్వాలని అన్ని నియోజకవర్గాల నుంచి అభిప్రాయాలు వచ్చినట్లు చెబుతున్నారు. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవికి పలువురు నాయకులు దరఖాస్తులు...

మిగతా 8వ పేజీలో...

గుమ్ముల వైపే అందరి చూపు

పీసీసీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన గుమ్ముల మోహన్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవికి బలమైన పోటీదారుగా నిలిచారు. విద్యార్థి దశ నుంచి పార్టీలో పనిచేస్తున్న మోహన్‌రెడ్డి 2006 నుం చి 2011 యూత్ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేసిన నాయకుడిగా అధిష్ఠానం వద్ద గుర్తింపు పొందారు. పార్టీ అధికారంలో లేని సంక్షోభ సమయంలోనూ పార్టీని వీడకుం డా కొనసాగడమేగాక, కార్యకర్తలను పార్టీ వీడకుండా కాపాడిన వ్యక్తిగా మోహన్‌రెడ్డికి పేరుంది. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండే నేతగా, పార్టీ వ్యవహారాలను, కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించే నేతగా మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, లీగల్‌సెల్, ఎన్ఎస్‌యూఐ, ఇతర విభాగాల నాయకులు, కార్యవర్గాలతో పాటు పలువురు సీనియర్ నేతలు, పీసీసీ సభ్యులు, డీసీసీ సభ్యులతో పాటుగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ నాయకులు ఏఐసీసీ పరిశీలకులకు సూచించారు. సామాజికవర్గం, రాష్ట్ర స్థాయి సర్దుబాట్లను పరిగణనలోకి తీసుకోకపోతే మోహన్‌రెడ్డికే డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే అభిప్రాయం మెజార్టీ నాయకుల్లో వెల్లడైనట్టు తెలుస్తోంది. జిల్లాలోని కీలకమైన నేతలు సైతం మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని అధిష్ఠానానికి సిఫారసు చేసినట్లు తెలిసింది.

డీసీసీబీకి మరో ఆరు కొత్త బ్రాంచీలు



- అనుమతి ఇచ్చిన ఆర్‌బీఐ
- రైతులకు విస్తరించనున్న సేవలు
- రూ.3,400కోట్లకు చేరిన టర్నోవర్
- మహిళా సంఘాలకు రూ.200కోట్ల రుణాలు

నల్లగొండ,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మరో ఆరు కొత్త బ్రాంచీలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి ఆర్‌బీఐ శుక్రవారం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 41 బ్రాంచీలు ఉండగా, కొత్తగా మరో ఆరు బ్రాంచీలు రానుండటంతో ఆ సంఖ్య మొత్తం 47కు చేరింది. కొత్తగా సూర్యాపేట జిల్లాలో మోతే, చిలుకూరులో బ్రాంచీలు ఏర్పడనుండగా, నల్లగొండ జిల్లా లో శాలిగౌరారం, నాంపల్లి, పెద్దవూర, మిర్యాలగూడ పట్టణంలో బ్రాంచీలు ఏర్పాటుకానున్నాయి. మిర్యాలగూడ పట్టణంలో అదనంగా కొత్త బ్రాంచీ రానుంది. ఇప్పటికే మిర్యాలగూడలో ఒకబ్రాంచీ నడుస్తుండగా, కొత్తగా బ్రాంచీ-2 మంజూరైంది. కొత్త బ్రాంచీల రాకతో రైతులకు సేవలు మరింత విస్తరించనున్నాయి. రైతుల కోసం 107 ఏళ్ల క్రితం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అంచెలంచెలుగా విస్తరిస్తోంది. డీసీసీబీ ప్రస్తుతం రూ.3,400 కోట్ల టర్నోవర్‌కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చే మార్చి నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్‌కు చేరేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గం, అధికారులు ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బలోపేతానికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే డీసీసీబీకి అత్యధికం బ్రాంచీలు ఉన్నాయి.

యాసంగిలో రూ.50 కోట్లకు పైగా పంట రుణాలు

యాసంగిలో రూ.50కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసేందుకు డీసీసీబీ బడ్జెట్

- మిగతా 7వ పేజీలో...

మద్యం టెండర్లకు నేడే చివరి రోజు

- ఒక్కరోజే 1,387 దరఖాస్తులు
- ఇప్పటివరకు మొత్తం 2,439 దరఖాస్తులు
- నేడు భారీగా వస్తాయని ఆశాభావం



నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎక్సైజ్ సంవత్సరానికి (2025-27) సంబంధించి జిల్లాలో ఏ-4 కేటగిరీ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటలతో గడువు ముగియనుంది. జిల్లాలో మొత్తం 154 దుకాణాలకు అధికారులు టెండర్లు ఆహ్వానించారు. శుక్రవారం ఒక్కరోజే గణనీయంగా 1,387 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు మొత్తం 2,439 దరఖాస్తులు వచ్చాయి. 18న సైతం భారీగా దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరు టెండర్ దాఖలుచేసే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 18న దరఖాస్తులు సమర్పించే రామగిరిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం, మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ వద్ద కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని నాంపల్లి వద్ద ఉన్న ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద కూడా దరఖాస్తులు తీసుకుంటారని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి బి.సంతోష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 154 మద్యం దుకాణాలకు ఎవరైనా నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సిండికేట్‌గా మారి, దరఖాస్తులు రాకుండా నియంత్రించినట్లు గుర్తిస్తే, రీటెండర్లు పిలుస్తామని స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు పోటీయే లేదు

- 70వేల పైచిలుకు ఓట్లతో నవీన్‌యాదవ్ గెలుపు ఖాయం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి పోటీయే లేదని, కనీసం 70వేల పైచిలుకు ఓట్లతో నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కంకణాలపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తాను 30ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, జూబ్లీహిల్స్‌లో పరిస్థితి ఏమిటో తనకు తెలుసన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరికీ కలిపి వచ్చే ఓట్లకు సమానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు వస్తాయన్నారు. తమ అభ్యర్థికి పోటీయే లేదని, 70వేల పైచిలుకు ఓట్లతో గెలుపు ఖాయమని తెలిపారు. హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం దేశచరిత్రలో నిలవబోతోందని అన్నారు. రూ.10,500 కోట్లతో హ్యామ్‌రోడ్లను నిర్మించబోతున్నామని, దీంతో రాష్ట్రంలో ప్రతి ఆవాసానికి తారు రోడ్డు, అదేవిధంగా ప్రతీ మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్లలో చేయని అభివృద్ధిని తాము 22 నెలల్లోనే చేసి చూపించామన్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సైతం గతేడాది కంటే 50శాతం అదనంగా ధాన్యం ఉత్పత్తి వచ్చిందని తెలిపారు. ఈసారి ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా కలిపి 72గంటల్లో బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం కాంటా అయిన లారీలను లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ల్యాబ్ ఏర్పాటుకు రూ. 1లక్ష అందజేత

తిప్పర్తి: మండలంలోని మామిడాల హైస్కూల్‌లో డిజిటల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.1లక్ష నగదును అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వస్తుండగా మామిడాల వద్ద విద్యార్థులను చూసి మంత్రి తన కాన్వాయ్‌ను నిలిపి వారితో మాట్లాడారు. ఏమి కావాలని ప్రశ్నించగా డిజిటల్, సైన్స్ ల్యాబ్ కావాలని కోరటంతో ప్రధానోపాధ్యాయుడిని పిలిపించి ఎంత ఖర్చు అవుతుందని అడిగారు. రూ.60వేలు అవుతుందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విష్ణు సమాధానమివ్వటంతో వెంటనే రూ.1లక్ష నగదు అందజేసి డిజిటల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని సూచించారు. పాఠశాలలో 9.5 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేల నగదు బహుమతితో పాటు, ఇంటర్ విద్యను చదివిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీఎస్‌వో వెంకటేష్, డీఎం గోపీకృష్ణ, డీసీవో పత్యానాయక్, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ముత్తినేని శ్యాంసుందర్, నాయకులు బద్ధం సుధీర్, ముత్తినేని నాగేశ్వర్‌రావు, బొల్లెద్దు అంబేడ్కర్, నాగరాణి, దాసరి జానయ్య, పుల్లభట్ల ప్రవీణ్ కుమార్, వనపర్తి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యాన్ని పెంచుకోవాలి

పీవోడబ్ల్యూ జాతీయ నేతలు సంధ్య, ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ నేత వి.సంధ్య

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు పోరాడే చైతన్యాన్ని మరింత పెంచుకోవాలని, స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించాలని పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, జి.ఝాన్సీ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర రాజకీయ తరగతులు జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. తొలుత అరుణ పతాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ ఆవిష్కరించగా, మహిళా అమరులను స్మరిస్తూ సంతాప తీర్మానాన్ని అందే మంగ ప్రవేశపెట్టారు. అనంతరం శిక్షణ తరగతులను బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య, ఝాన్సీ మాట్లాడుతూ, ఐక్యతే మహిళల బలమని, సామాజిక అభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించడం ఎంతో అవసరమన్నారు. మహిళా హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి నిర్వహించిన పోరాటంలో ప్రగతిశీల మహిళా సంఘం ముందుందన్నారు. ప్రపంచ మార్కెట్‌పై పెత్తనం కోసం అగ్రరాజ్యాలు యుద్ధాలను సృష్టిస్తున్నాయని అన్నారు. సనాతన ధర్మం పేరుతో మతఛాందసవాదులు మహిళలపై, పసి పిల్లలపై చేస్తున్న అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రపంచ యుద్ధాలు, వలసలు, మార్కెట్ విస్తరణ, వాణిజ్య పోటీ, అగ్ర రాజ్యాలు, సామ్రాజ్యవాద దేశాల తీరును వారు వివరించారు. శిక్షణాతరగతుల్లో హరిత, ఆర్.సీత, జ్యోతి, పద్మ,ఆదిలక్ష్మి, కె.జ్యోతి, ఉపేంద్ర, లక్ష్మి, భారతి, పాల్గొన్నారు.

నేటి బంద్‌కు సమాయత్తం

జిల్లాలో బైక్ ర్యాలీలు

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా బంద్‌కు నాయకులు సమాయత్తమయ్యారు. ఈ నెల 18న బంద్ నేపథ్యంలో శుక్రవారం జిల్లాలో పలు రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి, బీసీ సంఘాలు ర్యాలీలు నిర్వహించాయి. బంద్‌కు సహకరించాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బంద్ సందర్భంగా స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు మూసి వేసేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలోని పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డితో పాటు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ ద్వంద వైఖరిని ఖండిస్తూ రాజ్‌భవన్‌కు వెళ్లిన సీపీఎం నాయకులపై లాఠీచార్జ్ చేయడాన్ని నిరసించడంతో పాటు బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, చిత్రంలో గుమ్ముల మోహన్‌రెడ్డి

బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు : వర్షిత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): బీసీ సామాజిక న్యాయం కోసం చేపడుతున్న పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగంవర్షిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ, ప్రజా సంఘాలు, బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు 18న నిర్వహించే బంద్‌లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సౌలభ్యం కోసం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నూలగడ్డ కొత్తపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం పూర్తిగా ఎండి, తేమశాతం తగ్గాకే రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. నాణ్యతాప్రమాణాల మేరకు ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, ఏపీఎం పోలేపల్లి శంకర్, నాయకులు గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, సంకటి లింగయ్య, సమభావన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నూలగడ్డ కొత్తపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, దళిత సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. సీజేపై దాడిచేసిన వ్యక్తిపై ఇప్పటి వరకు కేసు ఎందుకు నమోదు చేయలేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరినా కులరక్కసి వెంటాడుతూ అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సీజేపై దాడి, మొత్తం దళితుల ఆత్మగౌరవం మీద జరిగిన దాడి అని అన్నారు. దళితులు ఉన్నత స్థానాల్లో ఉండడాన్ని కొంతమంది కులోన్మాదులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సీజేపై దాడి జరిగి 10 రోజులైనా కేసు నమోదు చేయకపోవడం, అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. సీజేపై దాడి జరిగిన కేసు విషయం ఇలా ఉంటే ఇక దేశంలో దళితుల పరిస్థితి ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతోందనన్నారు. ఇప్పటికైనా సీజేపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించి, దీని వెనక ఉన్న శక్తులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో న్యాయం చేసేంతవరకు పోరాటం ఆగదని, ఈనెల 27న హైదరాబాద్‌లో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించి తాడోపేడో తేల్చుకుంటామన్నారు. అనంతరం తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేడ్కర్, బట్ట శ్రీను, మాచర్ల ప్రతాప్, బట్ట చిన్న సైదులు, తాటిపాముల జానయ్య, తాటిపాముల నరసింహ, బట్ట లింగప్రసాద్, బట్ట సాయి, మాగి వెంకటేష్, మాచర్ల ముత్తయ్య, బోడ యాకోబు, బట్ట శివభిక్షం, వేముల సాయి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగర్‌కు ఏపీ రాష్ట్ర గవర్నర్

సాగర్‌లో రెండు రోజులపాటు విడిది

నాగార్జునకొండను సందర్శించనున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

7

బోధన వినూత్నం.. అందరికీ ఆదర్శం

● పాఠ్యాంశంలోని వేషధారణలో ఉపాధ్యాయురాలి బోధన



వెలుగుపల్లిలో మీరాబాయి వేషధారణలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు నివేదిత

తుంగతుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కర్పూర నివేదిత హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వరిస్తున్నారు. పాఠాలు సులభంగా అర్థమయ్యేందుకు ఆయా పాఠ్యాంశాల్లోని పలు పాత్రలను ఆమె ఎంచుకుని సోదాహరణంగా వివరిస్తున్నారు. గత ఏడాది ఇదే తరహాలో కొన్ని పాత్రలను విద్యార్థులతో వేయించి విద్యాబోధన చేశారు. ఈ ఏడాది మరింత ఆసక్తి పెంపొందించడానికి మీరాబాయి రచించిన భక్తిపథ్ పాఠాన్ని మీరాబాయి వేషధారణలో బోధించారు. నాట్య కళలోనూ ఆమెకు ప్రావీణ్యం ఉండటంతో విద్యార్థినులకు ఖాళీ సమయంలో భరత నాట్యం నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు నివేదిత మాట్లాడుతూ ప్రత్యక్ష విద్యాబోధనతోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. టీఎల్ఎం మేళాలో భాగంగా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడానికి మీరాబాయి వేషధారణతో విద్యార్థులకు పాఠాలు బోధించానన్నారు. ప్రత్యక్ష అనుభవంతోనే సులభంగా అర్థమవుతుందన్నారు. ఇలా నేర్చుకున్న పాఠాన్ని తాము జీవితంలో మర్చిపోలేమని విద్యార్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గంజాయితో పట్టుబడ్డ ముగ్గురు యువకులు



గంజాయితో పోలీసులకు పట్టుబడ్డ యువకులు

బీబీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):గంజాయి తాగడంతో పాటు ఇతరులకు విక్రయించే ప్రయత్నంలో ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో శుక్రవారం జరిగింది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి భూక్య ఆజాద్‌నాయక్‌తో పాటు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరుకు చెందిన పల్లె వంశీ, నవతా ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న మేకల స్టాలిన్, డిగ్రీ సెకండీరయర్ చదువుతూ ఆటో సర్వీస్‌లో పని చేస్తున్న బుడ్డ సునీల్ స్నేహితులు. వీరికి గంజాయి తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి తెచ్చుకున్న గంజాయిని తాగేందుకు అదే సమయంలో ఇతరులకు విక్రయించేందుకు బీబీనగర్ పట్టణానికి వచ్చారు. కొండమడుగు మెట్టుకు వెళ్లే సర్వీస్ రోడ్డుపై ఆటోలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసుల కంటపడ్డారు. ఆటోను ఆపి తనిఖీ చేయడంతో వారి నుంచి 1,394 గ్రాముల గంజాయి లభించింది. యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు,ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.యువకులపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్‌లో ఎస్‌ఐ రమేశ్, ఎస్‌ఐటీ అమర్‌సింగ్, సిబ్బంది అరవిందకుమార్, అంజయ్య, శ్రీనివాస్, అర్జున్ ఉన్నట్లు తెలిపారు.

ప్రేమించేందుకు నిరాకరించిందని హత్యాయత్నం

కేతేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రేమించాలని బాలికపై చేసిన ఒత్తిడి ఫలించకపోవడంతో బాలుడు హత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో గురువారం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన బాలికకు చికిత్సలు చేయించిన అనంతరం పూర్తి స్థాయిలో స్టేట్‌మెంట్ రికార్డు కోసం పోలీసులు జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రానికి తరలించారు. ఎస్‌ఐ సతీష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని చూసిన కొరివి మధు(19) తనను ప్రేమించాలంటూ చాలాసేపు బలవంతపెట్టాడు. అయితే సదరు బాలిక అందుకు అంగీకరించకపోవడంతో ఆందోళనతో బాలికపై కత్తితో దాడికి దిగాడు. ఇదే సమయంలో ఇంట్లోకి వచ్చిన బాలిక తండ్రి దాడి చేస్తున్న మధును అడ్డుకున్నాడు. దీంతో మధు అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ దాడిలో బాలిక చేతి మణికట్టు వద్ద గాయమవడమేగాక ఓ పన్ను ఊడిపోయింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మధుపై దాడి, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ సతీష్ వివరించారు. బాలికకు ప్రాథమిక చికిత్స అనంతరం స్టేట్‌మెంట్ రికార్డు కోసం ఆమెను నల్లగొండ జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రానికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

గొర్రెల దొంగల పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో నలుగురు గొర్రెల దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున స్థానిక ప్రెసిడెంట్ సూట్ వద్ద ఎస్‌ఐ కృష్ణస్వామి నేతృత్వంలో వాహనతనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వంగపల్లి గ్రామానికి చెందిన తాఫిక్ ఉమర్, నీలం కరుణాకర్, సీసా అరవింద్, ముడుగుల శ్రీనులను అదుపులోకి తీసుకుని విచారించారు. సెప్టెంబరు చివరి వారంలో యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో 14 గొర్రెలను అపహరించినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. వారి నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. ఆయనతో పాటుగా సిబ్బంది కిరణ్, నాగరాజు, శ్రీకాంత్, సాయి, గణేష్, ఉన్నారు.

జనరల్‌ఆసుపత్రికి సమస్యల అనారోగ్యం

● వైద్యులుంటే పరికరాల్లేవు

● పరికరాలున్న చోట్ల వైద్యుల కొరత



సూర్యాపేట జనరల్ ఆసుపత్రి వద్ద ఓపీ కోసం వచ్చిన రోగులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-భానుపురి)

సూర్యాపేట జనరల్ ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. పేదల కోసం కోట్ల రూపాయలు ప్రభుత్వాలు కేటాయించినా సరైన వసతులు, వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే పెద్దాసుపత్రిగా ఉందే తప్ప వైద్య సేవల కొరత వెంటాడుతోంది. కొన్ని ఔషధాలు మాత్రమే ఆసుపత్రిలో లభిస్తుండటంతో మిగతా వాటి కోసం ప్రైవేట్ ఔషధ దుకాణాలకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యులు విధులకు అడపాదడపా వచ్చి వెళ్తుండటం వల్ల వైద్యకళాశాల విద్యార్థులు జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పర్మినెంట్ ఉద్యోగుల కంటే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులే జనరల్ ఆసుపత్రిలో ఎనిమిది గంటల విధులు నిర్వహిస్తున్నారని రోగులు అంటున్నారు. ఒంటి గంట తర్వాత జనరల్ ఆసుపత్రిలో డాక్టర్లు విధుల్లో ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరికి ప్రైవేట్ ఆసుపత్రులు ఉండడంతో రోగులను అక్కడికి రప్పించుకుని వైద్యం అందిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. చర్మవ్యాధుల వైద్యులు సైతం సక్రమంగా సేవలు అందించడం లేదు. అనుభవం లేని విద్యార్థులు చూడడం వల్ల రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రేడియాలజిస్టుల కొరత

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ప్రధానమైన రేడియాలజిస్టుల కొరత రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో అల్ట్రాసౌండ్ సిస్టమ్ సేవలు నిలిచాయి. రెండు నెలలు దాటినా రేడియాలజిస్టులు విధులకు రావడం లేదు. వైద్యఆరోగ్యశాఖ కమిషనరేట్ మూడుసార్లు రేడియాలజిస్టులను కేటాయించినా జనరల్ ఆసుపత్రికి రావడానికి వారు విముకత వ్యక్తం చేశారు. ఏమీచేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు స్కానింగ్ సేవలు ప్రైవేట్‌లో పొందుతున్నారు.అక్కడ స్కానింగ్‌కు రూ.3,500ల చొప్పున ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. రెండు నెలల దాటినా రేడియాలజీస్టు వైద్యులు రాకపోవడంతో యంత్రాలు మరమ్మతులకు గురవుతున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు.

వైద్యులున్నా, పరికరాలేవీ?

జనరల్‌ఆసుపత్రిలో దంత వైద్యులు ఉన్నా సరైనా పరికరాలు లేవు. దీంతో చికిత్సలను ఔషధాలకే పరిమితం చేస్తున్నారు. దంత సంబంధిత శస్త్రచికిత్సల కోసం ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంటి వైద్యులు సైతం జనరల్ ఆసుపత్రిలో ఉన్నా పరికరాలు లేక శస్త్రచికిత్సలు చేయడంలేదు. డయాలసిస్ విభాగానికి రోజుకు 40నుంచి 50 మంది రోగులు వస్తున్నారు. కానీ రోజుకు 20 మందికి మాత్రమే సేవలు అందుతున్నట్లు రోగులు చెబుతున్నారు. బెడ్స్ ఐదు మాత్రమే ఉండటం, నెఫ్రాలజిస్ట్ వారంలో మూడు రోజులే వస్తున్నట్లు రోగులు ఆరోపిస్తున్నారు. పెద్దాసుపత్రిలో గుండె నిపుణులు, మూత్రపిండ వైద్యులు కొరత రోగులను వేధిస్తోంది.

పరికరాలు తెప్పిస్తాం



జనరల్ ఆసుపత్రిలో అన్ని సేవలు అందుతున్నాయి. దంత, కంటి శస్త్రచికిత్సల కోసం పరికరాలు తెప్పిస్తున్నాం. రేడియాలజిస్టు డాక్టర్ వచ్చారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీస్తున్నారు. మందుల కొరత లేదు. రోజు వారీగా పర్యవేక్షణ చేస్తున్నాం.

శ్రవణ్‌కుమార్, సూపరింటెండెంట్

బంగారం కోసం దారుణ హత్య



అనసూర్య(ఫైల్)

హుజూర్‌నగర్ , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగారం కోసం గొంతు నులిమి ఓ మహిళను దారుణంగా హత్య చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు, సీఐ చరమందరాజు కథనం మేరకు హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్డులోని ఏరియా ఆసుపత్రి సెంటర్‌లో నివాసం ఉంటున్న చెన్నా అనసూర్య(65)కు ఇద్దరు కుమారులున్నారు. ఆమె వస్త్ర వ్యాపారం చేస్తూ జీవిస్తోంది. భర్త గతంలోనే చనిపోగా పెద్దకుమారుడు వేణు తల్లివద్ద ఉంటూ వంట పనులు చేస్తుంటాడు. ఇటీవల అతను వంటలు చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాశీ క్షేత్రానికి వెళ్లారు. రెండో కుమారుడు రాము నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ పట్టణంలో ఉంటున్నాడు. గురువారం ఉదయం ఆమె ఇంట్లోకి వెళ్లిన స్థానికులు అనసూర్య మృతి చెంది ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పెద్దకుమారుడు కాశీ నుంచి వచ్చేందుకు ఆలస్యం కావడంతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. బంగారం కోసం తల్లి అనసూర్యను హత్య చేశారని, నాలుగు తులాల బంగారు గొలుసులను చోరీ చేసినట్లు రెండో కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె ఇంటి సమీపంలో ఉండటాన్ని సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. పట్టణంలో ఇటీవల ఏర్పాటుచేసిన సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు హత్యకు పాల్పడిన ఇద్దరు వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

చౌటుప్పల్‌లో చోరీ

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అంజనసాయి కాలనీలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన డొప్ప సురేష్ తన కుటుంబసభ్యులతో కలిసి చౌటుప్పల్‌లోని అంజనసాయి వెంచర్‌లో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం తాళాలు వేసి గ్రామానికి వెళ్లాడు. శుక్రవారం తిరిగి ఇంటికిరాగా తాళాలు విరగొట్టి ఉన్నాయి. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. బీరువాలోని 8 గ్రాముల బంగారం, 8తులాల వెండి కొంత నగదు చోరీకి గురైందని గ్రహించాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ముగ్గురు దొంగలు ముసుగు ధరించి కాలనీలో సంచరిస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో ఉన్నాయి. వారం రోజుల్లోనే పట్టణ కేంద్రంలో ఐదు దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

భువనగిరిలో

భువనగిరిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరుసగా నాలుగు రోజుల పాటు తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగిన ఉదంతం శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరిలో జరిగింది. స్థానిక 27వ వార్డులోని బీచ్‌మహల్లాకు చెందిన హలీంపాషా కుటుంబసభ్యులతో కలిసి బంధువుల వివాహం కోసం ఈ నెల 14న హైదరాబాద్ వెళ్లి తిరిగి 17వ తేదీ సాయంత్రం వచ్చాడు. అయితే వారు వచ్చేసారికి ఇంటి ముందు దర్వాజాలు విరిగి ఉన్నాయి. అనుమానంతో లోపలికి వెళ్లగా చూడగా 25 తులాల వెండి ఆభరణాలు, రూ. 15వేల నగదు అపహరించినట్లు గుర్తించాడు. దీంతో వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ ఎం రమేష్, క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బస్తీలలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇన్‌స్పెక్టర్ సెల్‌నెంబర్ 8712662471కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు

నార్కట్‌పల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు నిద్రిస్తున్న వృద్ధురాలిమెడలోని పుస్తెలతాడును దుండగుడు అపహరించాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌటబావి గ్రామంలో గురువారం అర్థరాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ క్రాంతికుమార్, గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. చౌటబావి గ్రామానికి చెందిన సోమ బుచ్చమ్మ ఇంటి ముందు ఉన్న రేకుల వసారా కింద మంచంపై నిద్రిస్తోంది. గురువారం అర్థరాత్రి గుర్తుతెలియని వ్యక్తి బుచ్చమ్మ వద్దకు వచ్చి ఆమె మెడలోని పుస్తెలతాడును బలవంతంగా లాగేశాడు. దీంతో మెలకువ వచ్చిన బుచ్చమ్మ అరిచేలోగానే పరారయ్యాడు. పుస్తెలతాడు మూడున్నర తులాలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఘటనా స్థలాన్ని సీఐ నాగరాజుతో కలిసి పరిశీలించి బాధితురాలి కుమారుడు సుధాకర్‌రెడ్డి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపాడు.

బాలాజీ నాయక్ ఏజెంట్లు అరెస్ట్



దేవరకొండలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ మౌనిక

కొండమల్లేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి మోసగించిన కేసులో నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలానికి చెందిన బాలాజీనాయక్‌కు చెందిన నలుగురు ఏజెంట్లను అరెస్టు చేసినట్లు దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపారు. శుక్రవారం దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధిక వడ్డీ పేరుతో ప్రజల నుంచి నగదు సేకరించటంపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలాజీనాయక్ ఏజెంట్లు అయిన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పలుగుతండాకు చెందిన రమావత్ చిరంజీవి, రమేష్‌నాయక్, రమావత్ సురేష్‌నాయక్, రమావత్ వినోద్‌నాయక్‌లను అరెస్ట్ చేసి వారినుంచి సుమారు రూ.6.77కోట్ల విలువైన ఆస్తిని, నాలుగు కార్లను, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. వినోద్ నాయక్ డీజే ఆపరేటర్‌గా, చిరంజీవి నాయక్ కారు డ్రైవర్‌గా, రమేష్‌నాయక్, సురేష్‌నాయక్‌లు వ్యవసాయం చేస్తూ కొండమల్లేపల్లిలో ఉంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ అధికవడ్డీ ఆశచూపే వ్యాపారులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంకెవరైనా బాధితులు ఉంటే గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో కొండమల్లేపల్లి సీఐ నవీన్‌కుమార్, కొండమల్లేపల్లి, గుర్రంపోడు, పీఏపల్లి ఎస్‌ఐలు అజ్మీరా రమేష్, మధు, నరసింహులు, నల్లగొండ స్పెషల్‌టీమ్ ఎస్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై వేలాడుతున్న మృతదేహం

పెద్దవూర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఫ్యూజ్ వేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామంలో జరిగింది. రైతు కుటుంబసభ్యులు, ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి గ్రామానికి చెందిన బొంగరాల వెంకటయ్య(55) గ్రామశివారులోని తన పొలానికి వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోవడాన్ని గమనించి దాన్ని జాయింట్ చేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేశాడు. అయితే ఒక ఫేజ్ కరెంట్ వైర్‌లేన్ నుంచి విడిపోలేదు. గమనించని వెంకటయ్య ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి ఫ్యూజ్ వైర్ జాయింట్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని రైతు ఆడెపు సైదులు గమనించి వెంకటయ్య భార్య నాగమ్మకు, గ్రామస్థులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. వెంకటయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో ఆశా కార్యకర్త



అరుణజ్యోతి(ఫైల్)

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మచ్చ అరుణజ్యోతి(45) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందింది. భర్త సైదులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన అరుణజ్యోతి రాత్రి 9గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తుందని తెలిపి, వెనువెంటనే కుప్పకూలి మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. ఆశా కార్యకర్తగా అరుణజ్యోతి అంకిత భావంతో పని చేసేదని గ్రామస్థులు తెలిపారు. పేదరికంతో బాధపడుతున్న అరుణజ్యోతి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి కోరారు.

తాటిచెట్టు పైనుంచి గీత కార్మికుడు



రామస్వామి

రాజాపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో గీత కార్మికుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కళ్లెం రామస్వామి(58) శుక్రవారం సాయంత్రం రోజు మాదిరే కల్లు గీసేందుకు వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనను వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రి సమీపంలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్సపొందుతూ

వ్యక్తి మృతి



యాకుబ్(ఫైల్)

భువనగిరి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజుల క్రితం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి జగదేవ్‌పూర్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎండీ యాకూబ్(38) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆయనకు భార్యతో పాటు ఏడాదిన్నర కుమార్తె ఉన్నారు. స్థానిక పహాడినగర్‌కు చెందిన అతడు చికెన్‌సెంటర్ నిర్వహించేవాడు. యాకూబ్ మృతితో జగదేవ్‌పూర్ రోడ్డుపై ఇటీవల జరిగిన వరుస ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాల నివారణకు రహదారి విస్తరణ పనులను అధికారులు వెంటనే చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నేరేడుగొమ్ము, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురంలో మూడు ఇసుక ట్రాక్టర్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనంచేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు డిండి రూరల్ సీఐ బీసన్న, నేరేడుగొమ్ము ఎస్‌ఐ నాగేంద్రబాబులు తెలిపారు. శుక్రవారం మండలంలోని పోలేపల్లి నుంచి నేరేడుగొమ్ముకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేశారు. ఇసుకను తరలిస్తున్న మున్నా, బాలు, భాస్కర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



రాస్తారోకో చేస్తున్న మృతురాలి బంధువులు

రజిత(ఫైల్‌ఫొటో)

అడవిదేవులపల్లి, మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామస్థులు వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బాపన్‌బాయ్‌తండాకు చెందిన రజిత(32)కు అడవిదేవులపల్లి మండలంలోని బాల్నెపల్లి గ్రామానికి చెందిన రమావత్ ఆంజనేయులుతో 2015లో వివాహం జరగ్గా వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రస్తుతం దంపతులు అడవిదేవులపల్లి మండలకేంద్రంలో తేజ కాన్వెంట్ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. రజితకు ఆంజనేయులుతో ఆరు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. కాగా గురువారం రాత్రి ఇంట్లో అత్త మరో గదిలో నిద్రించగా భర్త ట్యూషన్‌కు వెళ్లడంతో రజిత తన గదిలో ఉరివేసుకుంది. ట్యూషన్ నుంచి ఇంటికి వచ్చిన భర్త గమనించి వెంటనే మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలుపుతున్నారు. కాగా తమ కుమార్తెను భర్త ఆంజనేయులు, అత్త బాజు, మామ సూర్య, మరిది జోగ్యలే హత్య చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని రజిత కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

భర్తను శిక్షించాలి

భార్య రజిత మృతికి కారకులైన భర్త అంజనేయులును శిక్షించాలని కోరుతూ మిర్యాలగూడలోని ఏరియా ఆసుపత్రి ఎదుట రజిత బంధుమిత్రులు ఆందోళనకు దిగారు. భార్యను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించి నమ్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సాగర్‌రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు. ఆందోళనకారులను పోలీసులు సముదాయించి ఆందోళనను విరమింపజేయించారు. రాస్తారోకోతో కొద్దిసేపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

డెక్కన్ సిమెంట్ యాజమాన్యంపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగారావు

హుజూర్‌నగర్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో సమగ్ర విచారణ చేయాలని సామాజిక కార్యకర్త, తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు పరిశ్రమకు అండగా ఉంటూ ప్రజలకు కాలుష్యాన్ని అంటగడుతున్నారన్నారు. అక్రమంగా అటవీ భూములను ఆక్రమించుకున్నారని, కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. సమావేశంలో సైదులు, రంజాన్, నర్సయ్య పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్డులోకి దూసుకెళ్లిన లారీ



షెడ్‌లోకి దూసుకొచ్చిన లారీ

నాగారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో అతివేగంగా వచ్చిన లారీ రహదారి పక్కన ఉన్న షెడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నాగారంబంగ్లా వద్ద సూర్యాపేట-జనగాం జాతీయరహదారి వెంట ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ అదుపు తప్పడంతో అతివేగంగా సమీపంలోని బైక్ మెకానిక్ దుకాణంలోకి దూసుకెళ్లింది. షెడ్‌లో ఉన్న మెకానిక్‌లు గమనించి బయటకు పరిగెత్తారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం 11గంటలకు జరిగింది. ప్రమాదంలో బైక్‌లు దెబ్బతిన్నాయి, రేకులషెడ్ కూలింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ యాకుబ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

'సాగర్'లో కొనసాగుతోన్న విద్యుదుత్పత్తి

● 589.10 అడుగుల వద్ద సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 589.10 అడుగులుగా (309.3558టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,302 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8,022 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,333 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 52,157 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి 52,157 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. శుక్రవారం సాయంత్రం ఇన్‌ఫ్లో 2502.06 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టు రెండు గేట్లను ద్వారా 2529.15 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల నుంచి 292.14 క్యూసెక్కులు మొత్తం 2872.91 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.28అడుగులు(4.27టీఎంసీలు)గా ఉంది.

ఎఫ్ఆర్ఎస్ అమలులో వైఫల్యం

● కళాశాలల ప్రిన్సిపాళ్లకు నోటీసులు - రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలి

● నార్కట్‌పల్లి, హాలియా జూనియర్ కళాశాలలకు తాఖీదులు

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) అమలు చేయడంలో వైఫల్యంతో పాటు విద్యార్థులు తరగతులకు గైర్హాజరు అవుతున్నా నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో నార్కట్‌పల్లి, హాలియా (అనుముల) ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. హాలియాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 235 మంది విద్యార్థులు ఉండగా, నార్కట్‌పల్లి కళాశాలలో 392మంది ఉన్నారు. అయితే విద్యార్థులు 40శాతం లోపు మేరకే తరగతులకు హాజరవుతున్నారు. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ముఖ గుర్తింపు ప్రక్రియను చేపట్టకుండా నిర్లక్ష్యం చేసినట్లు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో హాజరు శాతం పెంచడంతో పాటు విద్యారంగంలో పారదర్శకత పెంచడం కోసం ఎఫ్ఆర్ఎస్‌ను అమలులోకి తీసుకువచ్చింది. ఈ విధానం ద్వారా విద్యార్థుల హాజరును పారదర్శకంగా నమోదు చేయడంతో పాటు వారిని తరగతులకు సమయానికి హాజరుకావడానికి ప్రోత్సహించాలని నిర్ణయించి అమలు చేశారు. విద్యార్థులు కళాశాలకు వచ్చినప్పుడు, తరగతులు ముగిసిన తర్వాత రెండుసార్లు ముఖ గుర్తింపును నమోదు చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల హాజరు ప్రక్రియను రోజువారీ, నెలవారీగా సమీక్షను నిర్వహిస్తుంటారు. అయితే నార్కట్‌పల్లి, హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు హాజరు శాతాన్ని పెంచడంలో నిర్లక్ష్యం చేయడం, ఎఫ్ఆర్ఎస్ అమలు చేయడంలో వైఫల్యం చెందినట్లు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు రెండు రోజులలోనే అందుకు సంబంధించి సంజాయిషీ ఇవ్వాలని స్పష్టం చేశారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



స్వామిఅమ్మవార్లకు పుష్పార్చన చేస్తున్న ప్రధానార్చకుడు భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చకుడు రాకేషాచార్యులు

యాదగిరిగుట్ట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వజ్ర వైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్ర నామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన చేపట్టారు. పాంచరాత్రాగమ రీతిలో గంటపాటు పూజా పర్వం కొనసాగింది.

వైభవంగా ఊంజల్ సేవోత్సవం

స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులమంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్థిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 12,91,083 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

నేడు సాగర్‌కు ఏపీ రాష్ట్ర గవర్నర్

● సాగర్‌లో రెండు రోజులపాటు విడిది

● నాగార్జునకొండను సందర్శించనున్న గవర్నర్



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ

నాగార్జునసాగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్ర పంచ పర్యాటక కేంద్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర గ వర్నర్ అబుల్‌నజీ ర్ రెండు రోజులు విడిది చేయనున్నారు. ఈ నెల 18, 19తేదీల్లో కుటుంబసమేతంగా సాగర్‌లో పర్య టించనున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు ఏపీలో ని విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11:50గంటలకు సాగర్ హిల్‌కాలనీ బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. విజయవిహార్ అతిథిగృహానికి చేరుకుని అక్కడ విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం భోజనం అనంతరం 2గంటలకు హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి ప్రత్యేక లాంచీలో జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు 3గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 4:15 గంటల వరకు మ్యూజియం, బౌద్ధ మత స్థూపాలను, నమూనాలను తిలకిస్తారు. నాగార్జున కొండ నుంచి సాయంత్రం 5:15 గంటలకు హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకుని, రాత్రి బస చేస్తారని అధికారులు తెలిపారు. ఆదివారం సాగర్ ప్రధాన డ్యాం, జలవిద్యుత్ కేంద్రాలను తిలకించి సాయంత్రం 4గంటలకు బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకొని, హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 4:50 గంటలకు తిరిగి విజయవాడకు చేరుకుంటారని అధికారులు తెలిపారు. ఏపీ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఏర్పాట్లను పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ పరిశీలించారు. బీసీ గురుకుల పాఠశాల మైదానంలో ఉన్న హెలిప్యాడ్‌ను, డౌన్ పార్కు వద్ద ఉన్న లాంచీస్టేషన్‌ను, గవర్నర్ బసచేసే విజయవిహార్ అతిథిగృహాన్ని పరిశీలించారు. అనంతరం సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ సాగర్ విజయ విహార్ అతిథి గృహంలో పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, అటవీ, నీటి పారుదల, వైద్య ఆరోగ్య, పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గవర్నర్ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

» సేవలందిస్తున్న రామచంద్రరాజు స్మారక ఆసుపత్రి

» తండా వాసులకు ఉచిత వైద్యసేవలు

తెలుగురాష్ట్రాల్లో గిరిజన తండాలెక్కువగా ఉన్న మండలాల్లో మఠంపల్లి ఒకటి. వర్షాకాలంలో డెంగీ, మలేరియా జ్వరాలు మామూలు సమయాల్లో పాముకాట్లు సర్వసాధారణంగా ఉండేవి. గుండె పోట్లు, రోడ్డు ప్రమాదాలు షరామామూలు. అక్కడ నుంచి ఏ పెద్దాసుపత్రికి వెళ్లాలన్నా పదిహేను కిలోమీటర్లు ప్రయాణించాలి. అక్కడక్కడా ప్రభుత్వ ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఉన్నా నిర్వహణలోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. అలాంటి చోట అనేక మందికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందిస్తోంది మఠంపల్లి మండలంలోని రామచంద్ర రాజు స్మారక ఆసుపత్రి.

\- మఠంపల్లి, ఆంధ్రజ్యోతి

ఛాతిలో నొప్పని ఎవరైనా ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే అది గుండెపోటో కాదో నిర్ధారించుకోవటానికి ఈసీజీతో పాటు ట్రోపినన్ - ఐ రక్త పరీక్ష చేస్తున్నారు. ఈసీజీ పెద్ద ఖర్చుకాదు కానీ, ఈ రక్త పరీక్షకు రెండు వేల రూపాయల దాకా అవుతుంది. హృద్రోగ సమస్య ఉన్నా లేకున్నా డాక్టర్ ఫీజుతో కలిపి తక్కువగా రూ2500 ఖర్చవుతాయి. ఒకవేళ గుండెపోటని నిర్ధారణ అయితే తక్షణమే గుండె నాళాల్లోని పూడిక తీయడానికి సుమారు వేయి రూ పాయల దాకా ఖర్చు అయ్యే ఇంజక్షన్ చేస్తారు. ఆ ఇంజక్షన్ చేసి అంబులెన్స్‌లో పెద్దాసుపత్రికి తరలించడానికి ఇంకో ఐదారు వేలన్నా కావొచ్చు. ఈ మొత్తం చికిత్సను అంబులెన్స్ వసతి సహా.. మారుమూల తండాల్లో ఉన్న ఆసుపత్రిలో పూర్తి ఉచితంగా అందిస్తున్నారు. ఇక డెంగీ పరీక్షకు అయితే బయట కనిష్ఠంగా వెయ్యి రూపాయలైనా అవుతుంది. ఈ ఆసుపత్రి పరీక్ష ఉచితంగా చేయడమే కాదు.. రోగి అవసరాన్ని బట్టి రోజంతా ఇక్కడే ఉంచి గ్లూకోజు ఎక్కిస్తారు. వీటన్నింటికన్నా గిరిజన తండాల్లో వారానికి ఐదారుకేసులైనా పాముకాటుకు సంబంధించి వస్తుంటాయి. ఆ బాధితులకు ఖరీదైన యాంటీవెనోమ్ చికిత్స చేయాల్సి వచ్చినా ఇక్కడ పైసా తీసుకోరు. సమస్య ఏదైనా సరే మందులన్నీ ఉచితంగా ఇస్తారు. ఈ సేవలు మఠంపల్లి మండలంలోని మట్టపల్లి అన్నకొండ ప్రాంతంలో ఉన్న రామచంద్రరాజు స్మారక చికిత్స కేంద్రంలో లభిస్తాయి.




ఆర్ఆర్‌హెల్త్ సెంటర్

కార్మికుల కోసమే కాదు

మట్టపల్లి పర్వత ప్రాంతంలో సుమారు 41 ఏళ్ల క్రితం నాగార్జున సిమెంట్ ప్లాంటు ఏర్పాటైంది. సదూర ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చే కార్మికుల కోసం ఇక్కడ కాలనీ నిర్మించారు. ఆ కార్మికుల కోసమే నాగార్జున సిమెంట్స్ యాజమాన్యం ఇక్కడో చిన్న క్లినిక్ మొదలు పెట్టింది. మొదట ఓ ఇంట్లో సాదాసీదాగా మొదలైన ఆ చికిత్స కేంద్రం ఆ కంపెనీతో పాటే విస్తరించింది. 2000లో ఆ కంపెనీ ఎండీ కలిదండి రామచంద్రరాజు ఈ వైద్య కేంద్రం ద్వారా తమ కార్మికులతో పాటూ పరిశ్రమ చుట్టూ ఉన్న ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలని సూచించారు. ఆయన తదనంతరం ఆసుపత్రికి రామచంద్రరాజు మెమోరియల్ హెల్త్‌కేర్ హస్పిటల్ (ఆర్ఆర్ఎంహెచ్‌హెచ్) అని పేరు పెట్టారు. నిర్వహణ కోసం ప్రత్యేక ట్రస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మట్టపల్లి చుట్టుపక్కలున్న రామచంద్రాపురం తండా, సుల్తాన్‌పురంతండా, భోజ్యతండా, భీమ్లా తండా, కృష్ణతండాతో పాటు మరో 20 తండా గ్రామాలకి సేవలందిస్తోంది. దగ్గర్లోని- ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా దాచేపల్లి మండలానికి చెందిన పలు పల్లెలవాళ్లు ఇక్కడికొస్తున్నారు. పేరుకిది ప్రాథమిక చికిత్స కేంద్రమైనా 10 పడకలతో రోగుల అవసరాన్ని బట్టి 24 గంటలూ పని చేస్తోంది. ఇక్కడున్న అత్యాధునిక ల్యాబ్‌లో దాదాపు అన్ని పరీక్షలు చేస్తారు. నేత్ర వైద్యానికి ప్రత్యేక విభాగం ఉంది. ఈ మండలం పరిధిలో తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగినా సరే ప్రాథమిక చికిత్స అందించే సకల వసతులూ ఇక్కడున్నాయి. రోగుల పరిస్థితిని బట్టి హైదరాబాద్ దాకా అంబులెన్స్‌లో తీసుకెళ్లే బాధ్యత తీసుకుంటారు. వారానికోసారి గైనకాలజిస్టు, నెలకోసారి పిల్లల వైద్యులు, మూడేళ్లకోసారి హృద్రోగ నిపుణులతో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. అంతేకాక మందులను అందిస్తుంటారు.

పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యం



పది మందికి ఉపయోగపడాలనేదే లక్ష్యంగా పని చేస్తున్నాను. పరిశ్రమ వారు ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో రెండు దశాబ్దాలుగా పేదలు, కార్మికులకు, వైద్యం అందిస్తున్నాను. పరిశ్రమ యాజమాన్యం సహకారంతో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేసికొని వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ ప్రాంత పేదలకు, కార్మికులకు అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ పంపిస్తాం. భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని తనవంతుగా పేద ప్రజలు, కార్మికులకు సేవ చేయడం ఎంతో సంతృప్తి అనిపిస్తోంది. పరిశ్రమ చుట్టు పక్కల గ్రామాలు, తండాలల్లో ప్రజలకే కాక మూగజీవాలకు సైతం శిబిరాలు నిర్వహిస్తున్నాం.

\- డాక్టర్ జిల్లేపల్లి శ్రీహరిరావు

వృత్తి అంటే ప్రాణం.. 20 ఏళ్లలో 5 రోజులే సెలవు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీహరిరావు

ఈ ఆసుపత్రికి ప్రస్తుతం చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో)గా డాక్టర్ జిల్లేపల్లి శ్రీహరిరావు వ్యవహరిస్తున్నారు. ఆయన వద్ద ఐదుగురు వైద్య సిబ్బంది పని చేస్తున్నారు. మాజీ ఎండీ రామచంద్రరాజు సూచనతో ఇక్కడి వైద్య సదుపాయాన్ని పల్లె వాసులందరికీ తీసుకెళ్లారు. నేటి పల్నాడు జిల్లా, మాచవరానికి చెందిన ఆయన గుంటూరులో ఎంబీబీఎస్ కాగానే ఈ ఆసుపత్రికి వచ్చారు. గత 30 ఏళ్లలో ఐదారురోజులే సెలవు పెట్టారు. ఆదిరారాలే కాదు పండుగలు, సెలవు రోజులైనా సరే ఆసుపత్రిలోనే ఉంటారు. అలా ఇప్పటిదాకా సుమారు ఐదున్నర లక్షల మందికి చికిత్స అందించారు. ఆ అంకితభావానికి ఐదుసార్లు రాష్ట్రస్థాయి, పది సార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ వైద్యుడిగా అవార్డులందుకున్నారు.

పచ్చని చెట్లు బొగ్గుబట్టీ పాలు

● చెట్లు నరికినా.. చర్యలు ఉండవా?

● పట్టించుకోని అధికారులు



గుంటుకగూడెం శివారులో నరికిన చెట్లు

నిడమనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు చె ట్లు దోహదం చేస్తాయి. అందుకే ప్రభుత్వం మొక్కల సంరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోంది. రోజురోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని సూచిస్తుంది. కానీ మండలంలో కొందరు బొగ్గుబట్టీల నిర్వాహకులు ఎలాంటి అనుమతులు లే కుండా భారీ వృక్షాలను నరికి అక్రమంగా బొగ్గుబట్టీలకు తరలిస్తున్నారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. చెట్ల నరికివేత వ్యవహారం మీ పరిధిలోకి రాదు, మా పరిధిలోకి రాదు అంటూ తాత్సారం చేయడం కూడా అనుమానాలకు తావిస్తోంది. మండలంలోని గుంటుకగూడెం గ్రామ పంచాయతీ శివారులో ముప్పారం మంచినీటి పథకం దగ్గర ఏళ్ల తరబడిగా ఉంటూ ప్రయాణికులు, పాదచారులకు నీడనిస్తున్న భారీ వృక్షాలను ఇటీవల కొందరు నరికి రెండు ట్రాక్టర్లలోకి ఎక్కించి కర్రను బొగ్గు బట్టీలకు తరలించారు. మరో లోడు కూడా తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా చూసిన కొందరు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేయగా అడ్డుకున్నారు. అక్రమంగా చెట్ల ను నరికిన విషయాన్ని కొందరు మండల పరిషత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎంపీడీవో సదరు పంచాయతీ కార్యదర్శిని వివరణ అడిగారు. దీంతో చెట్లు నరికేందుకు తాను ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆయన చెట్లు నరికిన వారిపై ఫిర్యాదు చేశారు. ఎవరి నుంచి ఎలాంటి ఒత్తిడి వచ్చిందో తెలియదు కానీ రెండు రోజుల తర్వాత ఇది మా పరిధిలోకి రాదు, అటవీశాఖ అధికారులు చూసుకుంటారని ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు. అంతేకాకుండా చెట్లు నరికిన వారిని పిలిపించిన తహసీల్దార్ వాల్టా చట్టం కింద కేసు పెడతానని హెచ్చరించారు. ప్రస్తుతం ఎక్కడా ఆ ఊసే వినిపించడం లేదు. అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లు నరికి పర్యావరణానికి హాని తలపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న కూలీలు

ఫిర్యాదు వెనక్కి తీసుకున్న విషయం తెలియదు

చెట్లు నరికిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. కానీ ఆ ఫిర్యాదును ఉపసంహరించుకున్న విషయం నా దృష్టికి రాలేదు. వివరాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటా.

\- బోనగిరి రమేష్, ఎంపీడీవో

కృష్ణమ్మకు మంగళ హారతి



కృష్ణమ్మకు మంగళహారతి ఇస్తున్న వేదపండితులు

మఠంపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహుని క్షేత్రంలో శుక్రవారం కృష్ణమ్మకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణానదికి పసుపు, కుంకుమార్చనలు, అభిషేకాలు, చీర, సారె సమర్పించి, దీపారాధన చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో కృష్ణమ్మకు మంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ అర్చకులు, ఉద్యోగులు భక్తులు పాల్గొన్నారు.

● మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

నల్లగొండ క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌పోటీలు నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందిం చే అంశాలకు సంబంధించిన అంశాలను తీసుకోవాలన్నారు. గతేడాది కాలంలో తీసిన 3 ఫొటోలు, తక్కువ నిడివి (3-నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ మాత్రమే ఈ పోటీల నామినేషన్లకు పంపించాల్సి ఉంటుంది. వాటిని ఈ నెల 23వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఐటీ కోర్ సెక్షన్ విభాగంలో అందజేయాలని కోరారు.

గిన్నీస్ బుక్‌లో చోటు సాధించిన కరాటే మాస్టర్ రామకృష్ణ

హుజూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో కరాటే మాస్టర్‌గా పనిచేస్తున్న బాణోత్ రామకృష్ణ గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సాధించారు. ఈ నెల 5వ తేదీన చెన్నయ్‌లోని ఎస్ఐవీఈటీ కళాశాలలో మాస్టర్ బాలమురుగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పోటీల్లో 3 వేల మంది పోటీ పడగా దేశ వ్యాప్తంగా 70 మంది వరల్డ్ రికార్డ్ సాధించారు. తొలి ప్రయత్నంలోనే గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో రామకృష్ణ చోటు సాధించడంపై ప్రిన్సిపాల్ పోసాని వెంకటరమణ అభినందించారు. శుక్రవారం పట్టణంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణను ఉపాధ్యాయ బృందం సన్మానించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది విద్యార్థులకు రామకృష్ణ కరాటే ఉచితంగా నేర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ వెంకట్, ఉపాధ్యాయులు ఉపేందర్, సాగర్, నాగకన్య, సంధ్య, రమేష్, నాగేందర్, రాంప్రసాద్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కరాటే మాస్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డీసీసీబీకి మరో ఆరు కొత్త బ్రాంచీలు

(5వ పేజీ తరువాయి)

కేటాయించింది. ప్రస్తుత వానాకాలంలో రూ.50 కోట్ల పంట రుణాలు మంజూరు చేసిన సహకార బ్యాంకు వచ్చే సీజన్‌లో రూ.50 కోట్లు ఇవ్వనుంది. సకాలంలో రైతులు తీసుకున్న రుణాలను చెల్లిస్తున్న నేపథ్యంలో సహకార బ్యాంకు పరిధిలోని ప్రతీ రైతుకు పెద్ద మొత్తంలో రుణాలు మంజూరుచేస్తున్నారు. రైతులకు పంట రుణాలను సకాలంలో ఇవ్వడం ద్వారా వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి తప్పింది. తక్కువ వడ్డీకి పంట రుణాలు ఇస్తుండటంతో రైతులకు ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. రికవరీ సైతం పెరగడంతో మంజూరు చేసే రుణ మొత్తాని సైతం అధికారులు పెంచుతూ వస్తున్నారు. అదేవిధంగా మహిళా సంఘాల బలోపేతం కోసం ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా తక్కువ వడ్డీకే ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు పంపిణీ చేయాలని డీసీసీబీ పాలకవర్గం నిర్ణయించింది. నాబార్డు రీఫైనాన్స్ ద్వారా రూ.200కోట్ల రుణాలు ఇవ్వడాన్ని లక్ష్యంగా నిర్ణయించింది. మహిళా సంఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ రుణాలు ఎంతగానో దోహదపడనున్నాయి. ఇక బంగారంపై రుణాలు ఇప్పటి వరకు రూ.1,040కోట్లు మంజూరు చేసి రాష్ట్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మొదటి స్థానంలో నిలిచింది. బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రతీ గ్రాముకు రూ.7,200 రుణంగా ఇస్తోంది.

రూ.200కోట్ల డిపాజిట్ల సేకరణ కోసం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది నవంబరు 30 నాటికి రూ.200కోట్ల డిపాజిట్‌లను సేకరించేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతనంగా సహకార కుబేర డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ డిపాజిట్ పథకంపై 7.65శాతం వడ్డీ ఇవ్వనుండగా, సీనియర్ సిటిజన్లకు 8.15శాతం వడ్డీ చెల్లించనున్నారు. డిపాజిట్లు పెద్ద మొత్తంలో సేకరించడం ద్వారా బ్యాంకు టర్నోవర్ పెంచుకొని రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు ఇతర రుణాల మంజూరు మొత్తాన్ని పెంచనున్నారు. వాణిజ్య బ్యాంకుల కంటే అధికంగా సహకార కుబేర డిపాజిట్ పథకం ద్వారా డిపాజిట్ దారులకు వడ్డీ చెల్లించేందుకు పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకొని రూ.70 కోట్ల లాభాలు ఆర్జించడం లక్ష్యంగా అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే విద్యా రుణాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు పెంచడం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 108ప్రాథమిక సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు రైతుల మన్ననలుపొందుతున్నాయి.

రైతుల సంక్షేమం కోసం ప్రణాళికలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సహకార బ్యాంక్ ఖాతాదారులు, రైతుల సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించాం. ఓ వైపు డిపాజిట్లు సేకరించి మరోవైపు అధిక వడ్డీ ఇస్తూ డిపాజిట్‌దారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఈ యాసంగిలో రైతులకు రూ.50కోట్ల పంట రుణాలను ఇవ్వనున్నాం. అదనంగా మరో ఆరు బ్రాంచీలకు అనుమతి ఇచ్చినందుకు ఆర్‌బీఐ అధికారులతో పాటు, నాబార్డు అధికారులకు కృతజ్ఞతలు. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రూ.5వేల కోట్ల టర్నోవర్‌కు తీసుకువచ్చి బ్యాంకును ప్రగతి పథంలోకి తీసుకెళ్తాం. ప్రభుత్వ సహకారంతో రైతులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. రానున్న రోజుల్లో ఈ సంక్షేమ పథకాలను మరింత విస్తరిస్తాం. అదేవిధంగా నూతన బ్రాంచీల వల్ల రైతులకు సేవలు మరింతగా విస్తరించనున్నాయి.

\- కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

21న ధాన్యం కొనుగోలు ప్రారంభం

మర్రిగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శివన్నగూడ పీఏసీఎస్ ద్వారా కొనుగోలు ప్రారంభించనున్నట్లు ఆ సంఘం చైర్మన్ బాల నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సొసైటీ పరిధిలో శివన్నగూడ, ఖుదాభక్ష్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. శివన్నగూడలో దొడ్డు రకం, సన్నరకం, కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

చిట్యాలరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడ గ్రామానికి చెందిన వడ్డెపల్లి నర్సింహ గురువారం రాత్రి మృతిచెందాడు. అతనితో పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం స్నేహితుడి మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థి అయిన జర్నలిస్టు కాసోజు శంకరాచారి మృతుని కుటుంబానికి రూ. 10వేల ఆర్థికసహాయాన్ని అందజేసి కుటుంబానికి అండగా ఉండాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

94 వేల ఎకరాల్లో పత్తి సాగు

జానిమియా, ఏడీఏ, నకిరేకల్



నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలో 94,305 ఎకరాల్లో పత్తి చేసినట్లు నకిరేకల్ ఏడీ ఏ జానిమియా తెలి పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథ కాలను ఆయన వివరించారు.

(నకిరేకల్, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: వ్యవసాయశాఖ నకిరేకల్ సబ్ డివిజన్‌లో ఎన్ని మండలాలు ఉన్నాయి.

ఏడీఏ: నకిరేకల్ సబ్ డివిజన్‌లో నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: డివిజన్‌లో రైతులు ఎన్ని ఎకరాల్లో పత్తి సాగు చేశారు?

ఏడీఏ: ఆరు మండలాల్లో 94,305 ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేశారు. వరుస వర్షాలతో వాతావరణం అనుకూలించకపోవడంతో పత్తి చేను ఎరుపు, నలుపు రంగులోకి మారాయి. దీంతో పూత, కాత రాలిపోయాయి.

ఆంధ్రజ్యోతి: పత్తి సీసీఐ కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

ఏడీఏ: నవంబరు మొదటి వారంలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు చేస్తున్నారా?

ఏడీఏ: వ్యవసాయ పనిముట్లను రైతులకు సబ్సిడీపై అందించేందుకు రూ. 1.30కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వానికి నివేదిక పంపాం. సబ్సిడీ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ఏర్పాటు చేశారా?

ఏడీఏ: ఆరు మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలి. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు. రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

హైవేపై చీకటి వెలుగుల ప్రయాణం

ప్రమాదం జరిగితే ప్రాణాలు గల్లంతే



కేతేపల్లిలో హైవేపై లైట్లు వెలగకపోవడంతో అలుముకున్న అంధకారం

కేతేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేతేపల్లిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై వారం రోజులుగా అంధకారం అలుముకుంది. కేతేపల్లి నిమ్మలమ్మ చెరువు సమీపం నుంచి మూసీ కుడి ప్రధాన కాల్వ వరకు దాదాపు కిలోమీటరు పొడవున ప్రధాన రహదారితో పాటు ఇరువైపులా గల సర్వీసు రోడ్ల వెంట హైమాస్ట్ లైట్లను పదేళ్ల క్రితం రహదారి విస్తరణ సమయంలో ఏర్పాటు చేశారు. గత ఏడాదికాలంగా ఈ విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోజుల తరబడి అవి వెలగని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే విస్తరణ పనులు నిర్వహించిన జీఎంఆర్ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన నాటి నుంచి సెంట్రల్ లైట్లతో పాటు సర్వీసు రోడ్ల వెంట ఏర్పాటు చేసిన వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు నెరవేర్చింది. గత ఏడాది క్రితం రహదారి నిర్వహణ నుంచి జీఎమ్మార్ సంస్థ తప్పుకోవడంతో ఆ బాధ్యతలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఓ ప్రైవేట్ ఏజెన్సీకి కాంట్రాక్టు పద్ధతిన అప్పగించింది. కొత్తగా రోడ్డు నిర్వహణ బాధ్యతలు చేపట్టిన సదరు ఏజెన్సీ బాధ్యులు ఆ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ రహదారిపై ఏదైనా సమస్య వస్తే రహదారి వెంట గ్రామాల వారు ఎవరికి, ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారిపై టోల్ చార్జీలు వసూలు చేస్తున్న వారు రహదారి వెంట గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారి, హైమాస్ట్ లైట్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం కేతేపల్లిలో వారం రోజులుగా రహదారి వెంట సగం ప్రాంతంలో లైట్లు వెలుగుతుండగా మరో సగం ప్రాంతంలో లైట్లు వెలగడంలేదు. దీంతో స్థానికంగా రోడ్డుదాటేందుకు గల జంక్షన్ల వద్ద (యూటర్నులు) సాయంత్రం వేళ రోడ్డుకు ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు వెళ్లే గొర్రెలు, మేకలు, పాడిగేదెలు, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే పశువులు, కాలినడకన రోడ్డు దాటే వారు రహదారిపై వేగంగా వెళ్లే వాహనచోదకులకు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే శని, ఆదివారాలు వీకెండ్, సోమవారం దీపావళి పండగతో వరుస సెలవులు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో 65వ నెంబరు జాతీయ రహదారి రెండు రోజుల పాటు ఏపీ, తెలంగాణలకు బారులు తీరి వెళ్లే వాహనాలతో కిక్కిరిసిపోనుంది. దీంతో ఈ రహదారిపై కమ్ముకున్న చీకటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు స్థానికుల్లో నెలకొన్నాయి. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ యంత్రాంగం, సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు స్పందించి హైవేపై హైమాస్ట్ లైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని కేతేపల్లివాసులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి

ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి తప్పనిసరిగా పారిశుధ్య నిర్వహణ చేపట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామాల అభివృద్ధి నిర్వహణపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతుల కల్పనకు, ఆర్థిక వనరుల కోసం ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు కుంటు పడకుండా కూలీలకు పనులు కలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో సిద్దేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం

● నేటి బీసీ బంద్ జయప్రదం చేయాలని జేఏసీ పిలుపు



నల్లగొండ జిల్లా కేంద్రంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

మునుగోడు, కేతేపల్లి, చిట్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే సహించేది లేదని బీసీ జేఏసీ నేత, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్యయాదవ్ హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఈ నెల 18వ తేదీన తలపెట్టిన బంద్ పిలుపు నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన ప్రకారం బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అన్నివర్గాలు సంపూర్ణంగా బంద్ పాటించాలని కోరారు. అనంతరం స్థానిక ప్రధాన రహదారులపై బీసీ జేఏసీ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. బీసీ జేఏసీ నేతలు బూడిద మల్లికార్జున్ యాదవ్, గుంటోజు వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో నాయకులు ఆనగంటి కృష్ణరజక, నేరటి మల్లేష్, గురిజ రామచంద్రం, మాల్గా యాదన్న, తీర్పారి వెంకటేశ్వర్లు, బొల్గూరి నర్సింహ, ఏరుకొండ శ్రీనివాస్, జీడిమెట్ల రాజ్‌కుమార్, మందుల సత్యం, మారగోని అంజయ్య, పెంబళ్ల జానయ్యయాదవ్, మిర్యాల వెంకన్న, జిట్టగోని యాదగిరి, చాపల శ్రీను, కైలాసం, సురేష్‌కుమార్, లింగస్వామి, శ్రీను, యాదయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మమ్మ బీసీ సంఘం నాయకులతో కలిసి బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలను నిరసిస్తూ చేపట్టిన బంద్‌లో బీసీలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ బయ్య మత్తయ్య, కాంగ్రెస్ అనుబంధ బీసీ సంఘం నాయకులు కోట పుల్లయ్య, జె.వెంకటనర్సయ్యయాదవ్, ఎస్.మంగమ్మ, ఎ.వెంకట్‌గౌడ్, ఎస్.కిరణ్, జె.సైదులు, దువ్వని ఎర్రయ్య, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల దేవదాస్ మాట్లాడారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు పొన్నం లక్ష్మయ్య, ఎద్దులపురి కృష్ణ, పల్లె వెంకన్న, చికిలంమెట్ల అశోక్, గ్యార మారయ్య, బెల్లి సత్తయ్య, బొబ్బల రాంరెడ్డి, ఇబ్రహీం, జంపాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి కులస్థులకు నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలి

కనగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మరి కులస్థులకు ఎండోమెంట్ నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేశం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దర్వేశిపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల వద్ద వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. దీపావళి అనంతరం గ్రామ, మండల కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ కన్వీనర్ రాధార భిక్షపతి, కోకన్వీనర్ గంగాధర వెంకటేశ్వర్లు, అనిత నియోజకవర్గ ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నీలం మధు

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నీలం మధును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేంద్రగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు బీసీ కులాల వారందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 42శాతం రిజర్వేషన్‌తోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

నిర్వహణ లోపం విద్యార్థులకు శాపం

● మరమ్మతులకు గురైన వాటర్ ఫిల్టర్ ● పట్టించుకోని అధికారులు



నాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన వాటర్ ఫిల్టర్

నాంపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు తాగునీరు అందించే వాటర్ ఫిల్టర్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 500 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారు. పదేళ్ల క్రితం కొండమల్లేపల్లికి చెందిన సంజీవని ట్రస్టు వారు ఫ్లోరిన్ నీటి బారి నుంచి రక్షించి, విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో నాంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో లక్షల రూపాయల వెచ్చించి వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు వాటర్ ఫిల్టర్ నుంచి నీటిని అందించారు. గతేడాది మరమ్మతులకు గురైంది. దీంతో విద్యార్థులు ఫ్లోరిన్ నీటిని తాగే పరిస్థితి ఏర్పడింది. వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేసి శుద్ధమైన నీటిని అందించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వాటర్ ఫిల్టర్‌ను త్వరలో మరమ్మతులు నిర్వహించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని తెలిపారు.

అడ్మిషన్లలో నిబంధనలు తొలగించాలి

● కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులను 99మంది మాత్రమే తీసుకోవాలనే నిబంధనలను తొలగించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. నల్లగొండలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువుకోవడానికి వచ్చిన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి విద్యార్థులకు అడ్మిషన్ సౌకర్యం కల్పించాలని, కలెక్టర్ స్పందించి నిబంధనల పేరుతో తొలగించిన విద్యార్థులను తక్షణమే తీసుకోవాలని కోరారు. వారికి మెస్, కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలగించిన విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్, రవీందర్, కిరణ్, నవదీప్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలి

నల్లగొండటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు పనిచేస్తున్న మాజీ జడ్పీటీసీ, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని గొల్లగూడ పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఏఐసీసీ మాజీ సెక్రటరీ బిస్వరంజన్ మహంతి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ జూలకంటి శ్రీనివాస్, బొంత యాదగిరి తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

కేతేపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని కేతేపల్లి మండల వ్యవసాయ అధికారి పురుషోత్తం కోరారు. మండలంలోని ఇనుపాముల, కొండకిందిగూడెం, కొర్లపహాడ్, చీకటిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రైతులతో మాట్లాడుతూ కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులు ధాన్యంలో తాలు గింజలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట మానిటరింగ్ ఆఫీసర్ వంశీ, ఏఈవో నాగరాజు, ఆయా కేంద్రాల నిర్వాహకులు, పలువురు రైతులు ఉన్నారు.

సీరియల్ ప్రకారం కొనుగోలు చేయాలి



పగిడిమర్రిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

కనగల్, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) : ఐకేపీ కేంద్రాల్లో సీరియల్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో సుమలత అన్నారు. మండలంలోని వేమిరెడ్డిగూడెం, పగిడిమర్రి గ్రామాల్లో శుక్రవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ నిర్వాహకులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతిని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సునీత, ఏఈఓ కీర్తన, ఏపీఎం మైసేశ్వర్‌రావ్, సీసీ ఇద్దయ్య, మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, పద్మానర్సిరెడ్డి, కృష్ణవేణి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

కట్టంగూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని ఏపీడీ యామిని అన్నారు. మండలంలోని ఉపాధి హామీ పథకం ద్వారా 1.04.2024 నుంచి 31.3.2025 వరకు జరిగిన పనులపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మండలంలోని 22 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.6,010,55,35కోట్లు ఖర్చు చేయగా కూలీలకు రూ.5,87,66,440 సామాగ్రికి రూ.1,33,90,96 చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఉపాధిహామీ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.266ను రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఎం వేణు, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞాన ప్రకాశ్‌రావు, డీపీఓ చకిలం వేణుగోపాలరావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గౌతమి, ఎంపీవో స్వరూపారాణి, ఏపీవో కడెం రామ్మోహన్, పీఆర్‌ఏఈ జమీల్, కార్యదర్శులు ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలను జరిపించి చీర సారె, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఆలయ ముఖ్య అర్చకుడు మల్లాచారి అమ్మవారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఒక్కరూ సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలి



చిట్యాల మండలంలోని వట్టిమర్తి జడ్పీహెచ్ఎస్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నార్కట్‌పల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నార్కట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకుమార్ సూచించారు. శుక్రవారం 108 సర్వీసు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామీణ ప్రజలకు సీపీఆర్ ఆవశ్యకతను వివరించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో 108సర్వీసు ఈఎంటి కె.వెంకటేశం, పైలట్ బి.రవి పాల్గొన్నారు.

● శాలిగౌరారం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి, వైద్య సిబ్బందికి, యూత్‌కు సీపీఆర్ పై మండల వైద్యాధికారి సూర్య శిల్పఅవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతి లక్ష్మి, రెండవ వైద్యాధికారిని శ్వేత, ఏపీవో జంగమ్మ, ఈసీ వెంకటాచారి, 108 ఈఎంటి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్ : మండలంలోని వట్టిమర్తి జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎన్ఎం నాగమణి, సీపీఆర్‌పై ప్రత్యక్ష అవగాహనను కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలిగొండ పరమేష్, పి. ఆనంద్, డి. సూర్యప్రకాష్, ఎం. నీరజ, పి. చంద్రయ్య, అనీ స్ ఫాతిమా, ఎ. నర్సింహ, అంగన్‌వాడీ టీచర్లుపాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని ఈదులూరు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ పాల్గొని మాట్లాడుతూ అత్యవసర సమయంలో సీపీఆర్ చేస్తే ప్రమాదం నుంచి కాపాడవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.నర్సిరెడ్డి, సీహెచ్‌వో నరసింహారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్, ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పి.రాములు, లయన్స్ క్లబ్ సభ్యులు ఉన్నారు.

డీసీసీ పదవిపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నా, ప్రధానంగా నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, పీసీసీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శులు దైద రవీందర్, చనగాని దయాకర్‌గౌడ్, తదితర నేతలు పోటీ పడుతున్నారు.

ఎస్సీ వర్గానికి కేటాయిస్తే కొండేటికి ఛాన్స్

డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీలకే కేటాయించాలని అధిష్టానం భావిస్తే పదవి మల్లయ్యకు దక్కే అవకాశం ఉంది. 20 ఏళ్లగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు, గత ఎన్నికలకు ముందు నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. జడ్పీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు సైతం కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి భంగపడిపోయిన సందర్భంలో రానున్న రోజుల్లో తప్పకుండా పదవి ఇస్తామని అధిష్టానం ఇచ్చిన హామీని నెరవేర్చాలని మల్లయ్య ఏఐసీసీ పరిశీలకులను, జిల్లా కీలక నేతలను కోరారు.

బీసీ కోటాలో యువ నేతల తీవ్ర ప్రయత్నాలు

నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి తమ పేర్లను పరిశీలించాలని యువ బీసీ నేతలు దరఖాస్తు చేసుకొని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా ప్రస్తుత పీసీసీ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్న పున్నా కైలాష్‌నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరిలో పున్నా కైలాష్ కాంగ్రెస్‌లో విద్యార్థి దశ నుంచి పనిచేయడమేగాక, తెలంగాణ ఉద్యమనేతగా, ఓయూ జేఏసీ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన 2018, 2022 2023 ఎన్నికల్లోనూ మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి, 2024 ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థిగా టిక్కెట్ ఆశించినా సమీకరణాల్లో ఛాన్స్ దక్కలేదు. ఆ సందర్భంలో అధిష్టానం భవిష్యత్‌లో కీలకమైన అవకాశం ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ డీసీసీ పదవి ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరో బీసీ యువనేత చనగాని దయాకర్ గౌడ్ ఓయూ జేఏసీ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా పలు ఉద్యమాలను నిర్వహించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న దయాకర్‌గౌడ్ డీసీసీ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవిని గతంలోనూ గౌడ సామాజికవర్గానికి చెందిన ఇద్దరు, నలుగురు పార్టీకి సేవలందించారు. అదే ఒరవడిలో ఈ దఫా తనకు అవకాశం ఇవ్వాలని దయాకర్ తన వాదనను అధిష్టానం ముందుంచారు. మరి అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో చూడాల్సిందే.

బాధితులకు ఎల్‌వోసీల అందజేత



ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం


కేతేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన ఎల్‌వోసీలను ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం ఆయా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని భీమారం గ్రామానికి చెందిన కోట శ్రీకాంత్ కుమారుడు అభిషేక్‌రాజు అనే బాలుడు కిడ్నీలో రాళ్లతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్య సేవల కోసం ఆర్థిక సాయానికి సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయగా రూ.50వేలకు ఎల్‌వోసీ మంజూరైంది. అలాగే చెరుకుపల్లి గ్రామానికి చెందిన వల్లపు పద్మకు రూ.2.50వేలు, వల్లాసు వెంకటమ్మకు రూ.లక్ష విలువైన ఎల్‌వోసీలు మంజూరయ్యాయి. వీరికి శుక్రవారం నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా చెక్కులను ఎమ్మెల్యే వీరేశం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బడుగుల నరేందర్, గుత్తా మాధవరెడ్డి, తదికోట శ్రీను, వినయసాగర్ పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడు మండలం పులిపల్పుల గ్రామానికి చెందిన దోటి రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా మెరుగైన వైద్యం కోసం మంజూరు చేయించిన రూ.5లక్షలు చెక్కును ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు పైడులు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల హైస్కూల్‌కు సౌండ్ సిస్టమ్ విరాళం

చిట్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం కమ్మరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 20వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి. సుశీల, ఉపాధ్యాయులు పద్మజ, కవిత, సైదులు, ప్రసన్న, మంజుల, సాదిక్, సౌమ్య, కుసుమ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.2
ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.10 (309.3558)	52,157	52,157
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.28 (4.27)	2,872.91	2,502.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.751 (43.8403)	38,900	37,734

చికెన్ ధరలు	లైవ్ : రూ.139	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240



ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిశ్వరంజన్ మహంతి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి.

డీసీసీ పదవిపై.. ఉత్కంఠ

రాజకీయంగా రాష్ట్రస్థాయి ప్రాధాన్యం కలిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కీలక నేతలు ఈ పదవిని ఆశిస్తూ ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్నారు. పీసీసీ కార్యవర్గంలో స్థానం లభించిన నేతలు డీసీసీ పదవికి పోటీపడుతూ దరఖాస్తు చేయడం, రాజకీయంగా ఉద్దండులు ఉన్న జిల్లా కావడంతో అందరినీ సమన్వయం చేసే సమర్థత కలిగిన నేతకు బాధ్యతలు ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలుస్తోంది.
- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- సమర్థత, సమన్వయం, సీనియార్టీ వైపే క్యాడర్ మొగ్గు
- గుమ్ముల మోహన్‌రెడ్డి వైపే అందరి చూపు
- కొండేటి, పున్నా కైలాష్, దయాకర్‌గౌడ్ తీవ్ర ప్రయత్నాలు

రానున్న రోజుల్లో డీసీసీలే పార్టీకి సుప్రీం అని ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం అందుకు అనుగుణంగానే అధ్యక్ష పదవికి గతంలో మాదిరిగా నామినేట్ చేయకుండా, క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు సేకరిస్తోంది. అధ్యక్షుడి ఎంపికపై ఎవరి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాలకు చెందిన ఏఐసీసీ బాధ్యులను ఈ ప్రక్రియకు పరిశీలకులుగా నియమించింది. జిల్లాలోనూ ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బిశ్వరంజన్ మహంతి వారం రోజులుగా సహాయ పరిశీలకులతో కలిసి జిల్లాలో మకాం వేసి అన్ని బ్లాక్‌స్థాయి సమావేశాల్లో పాల్గొని అభిప్రాయ సేకరణ చేశారు. గతానికి భిన్నంగా అధిష్ఠానం భారీ కసరత్తు చేస్తుండగా, మరోవైపు పదవి ఆశించే నేతల బలమైన ప్రయత్నాల నేపథ్యంలో ఈ దఫా పదవి ఎవరిని వరిస్తుందనే అంశంపై పార్టీ క్యాడర్‌లో ఆసక్తి కొనసాగుతోంది.

సమర్థత, సమన్వయశక్తి, సీనియార్టీకే క్యాడర్ జై

అత్యంత కీలకమైన నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలనే అంశంపై బ్లాక్‌స్థాయిల్లో జరిగిన సమావేశాల్లో విస్తృతస్థాయిలో అభిప్రాయాలు సేకరించారు. ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకున్న ఏఐసీసీ పరిశీలకులు క్యాడర్ మనోగతాన్ని సైతం నమోదు చేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కీలక నేతలు సైతం వారి సూచనలను ఏఐసీసీ పరిశీలకులకు తెలియజేశారు. భిన్నమైన రాజకీయ వాతావరణం, రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా కావడం, రాష్ట్ర స్థాయి కీలక నేతలు కలిగిన ఈ జిల్లాలో పార్టీని నడిపే సామర్థ్యం, సీనియర్లు, జూనియర్లనే భేదాల్లేకుండా అందరినీ సమన్వయం చేసే నేతకే పదవి ఇవ్వాలనే బలమైన అభిప్రాయం క్యాడర్ నుంచి వెల్లడైంది. ప్రధానంగా జిల్లా కేంద్రంలో ఉంటూ క్యాడర్‌కు నిత్యం అందుబాటులో ఉండే నేతకు అవకాశం ఇవ్వాలని అన్ని నియోజకవర్గాల నుంచి అభిప్రాయాలు వచ్చినట్లు చెబుతున్నారు. జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవికి పలువురు నాయకులు దరఖాస్తులు...

మిగతా 8వ పేజీలో...

గుమ్ముల వైపే అందరి చూపు

పీసీసీ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన గుమ్ముల మోహన్‌రెడ్డి డీసీసీ అధ్యక్ష పదవికి బలమైన పోటీదారుగా నిలిచారు. విద్యార్థి దశ నుంచి పార్టీలో పనిచేస్తున్న మోహన్‌రెడ్డి 2006 నుం చి 2011 యూత్ కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేసిన నాయకుడిగా అధిష్ఠానం వద్ద గుర్తింపు పొందారు. పార్టీ అధికారంలో లేని సంక్షోభ సమయంలోనూ పార్టీని వీడకుం డా కొనసాగడమేగాక, కార్యకర్తలను పార్టీ వీడకుండా కాపాడిన వ్యక్తిగా మోహన్‌రెడ్డికి పేరుంది. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండే నేతగా, పార్టీ వ్యవహారాలను, కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించే నేతగా మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, లీగల్‌సెల్, ఎన్ఎస్‌యూఐ, ఇతర విభాగాల నాయకులు, కార్యవర్గాలతో పాటు పలువురు సీనియర్ నేతలు, పీసీసీ సభ్యులు, డీసీసీ సభ్యులతో పాటుగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ నాయకులు ఏఐసీసీ పరిశీలకులకు సూచించారు. సామాజికవర్గం, రాష్ట్ర స్థాయి సర్దుబాట్లను పరిగణనలోకి తీసుకోకపోతే మోహన్‌రెడ్డికే డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే అభిప్రాయం మెజార్టీ నాయకుల్లో వెల్లడైనట్లు తెలుస్తోంది. జిల్లాలోని కీలకమైన నేతలు సైతం మోహన్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని అధిష్ఠానానికి సిఫారసు చేసినట్లు తెలిసింది.

డీసీసీబీకి మరో ఆరు కొత్త బ్రాంచీలు





- అనుమతి ఇచ్చిన ఆర్‌బీఐ
- రైతులకు విస్తరించనున్న సేవలు
- రూ.3,400కోట్లకు చేరిన టర్నోవర్
- మహిళా సంఘాలకు రూ.200కోట్ల రుణాలు

నల్లగొండ,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మరో ఆరు కొత్త బ్రాంచీలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించి ఆర్‌బీఐ శుక్రవారం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 41 బ్రాంచీలు ఉండగా, కొత్తగా మరో ఆరు బ్రాంచీలు రానుండటంతో ఆ సంఖ్య మొత్తం 47కు చేరింది. కొత్తగా సూర్యాపేట జిల్లాలో మోతే, చిలుకూరులో బ్రాంచీలు ఏర్పడనుండగా, నల్లగొండ జిల్లా లో శాలిగౌరారం, నాంపల్లి, పెద్దవూర, మిర్యాలగూడ పట్టణంలో బ్రాంచీలు ఏర్పాటుకానున్నాయి. మిర్యాలగూడ పట్టణంలో అదనంగా కొత్త బ్రాంచీ రానుంది. ఇప్పటికే మిర్యాలగూడలో ఒకబ్రాంచీ నడుస్తుండగా, కొత్తగా బ్రాంచీ-2 మంజూరైంది. కొత్త బ్రాంచీల రాకతో రైతులకు సేవలు మరింత విస్తరించనున్నాయి. రైతుల కోసం 107 ఏళ్ల క్రితం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అంచెలంచెలుగా విస్తరిస్తోంది. డీసీసీబీ ప్రస్తుతం రూ.3,400 కోట్ల టర్నోవర్‌కు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చే మార్చి నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్‌కు చేరేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గం, అధికారులు ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బలోపేతానికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే డీసీసీబీకి అత్యధికం బ్రాంచీలు ఉన్నాయి.

యాసంగిలో రూ.50 కోట్లకు పైగా పంట రుణాలు

యాసంగిలో రూ.50కోట్లకు పైగా రుణాలు మంజూరు చేసేందుకు డీసీసీబీ బడ్జెట్

- మిగతా 7వ పేజీలో...

మద్యం టెండర్లకు నేడే చివరి రోజు

- ఒక్కరోజే 1,387 దరఖాస్తులు
- ఇప్పటివరకు మొత్తం 2,439 దరఖాస్తులు
- నేడు భారీగా వస్తాయని ఆశాభావం



నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఎక్సైజ్ సంవత్సరానికి (2025-27) సంబంధించి జిల్లాలో ఏ-4 కేటగిరీ మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటలతో గడువు ముగియనుంది. జిల్లాలో మొత్తం 154 దుకాణాలకు అధికారులు టెండర్లు ఆహ్వానించారు. శుక్రవారం ఒక్కరోజే గణనీయంగా 1,387 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు మొత్తం 2,439 దరఖాస్తులు వచ్చాయి. 18న సైతం భారీగా దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు భావిస్తున్నారు. ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరు టెండర్ దాఖలుచేసే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 18న దరఖాస్తులు సమర్పించే రామగిరిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం, మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ వద్ద కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు. బారీకేడ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని నాంపల్లి వద్ద ఉన్న ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద కూడా దరఖాస్తులు తీసుకుంటారని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారి బి.సంతోష్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 154 మద్యం దుకాణాలకు ఎవరైనా నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సిండికేట్‌గా మారి, దరఖాస్తులు రాకుండా నియంత్రించినట్లు గుర్తిస్తే, రీటెండర్లు పిలుస్తామని స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు పోటీయే లేదు

- 70వేల పైచిలుకు ఓట్లతో నవీన్‌యాదవ్ గెలుపు ఖాయం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి పోటీయే లేదని, కనీసం 70వేల పైచిలుకు ఓట్లతో నవీన్‌యాదవ్ గెలుపు ఖాయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కంకణాలపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తాను 30ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నానని, జూబ్లీహిల్స్‌లో పరిస్థితి ఏమిటో తనకు తెలుసన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులిద్దరికీ కలిపి వచ్చే ఓట్లకు సమానంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు వస్తాయన్నారు. తమ అభ్యర్థికి పోటీయే లేదని, 70వేల పైచిలుకు ఓట్లతో గెలుపు ఖాయమని తెలిపారు. హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం దేశచరిత్రలో నిలవబోతోందని అన్నారు. రూ.10,500 కోట్లతో హ్యామ్‌రోడ్లను నిర్మించబోతున్నామని, దీంతో రాష్ట్రంలో ప్రతి ఆవాసానికి తారు రోడ్డు, అదేవిధంగా ప్రతీ మండలం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్లలో చేయని అభివృద్ధిని తాము 22 నెలల్లోనే చేసి చూపించామన్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సైతం గతేడాది కంటే 50శాతం అదనంగా ధాన్యం ఉత్పత్తి వచ్చిందని తెలిపారు. ఈసారి ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా కలిపి 72గంటల్లో బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం కాంటా అయిన లారీలను లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.

ల్యాబ్ ఏర్పాటుకు రూ. 1లక్ష అందజేత

తిప్పర్తి: మండలంలోని మామిడాల హైస్కూల్‌లో డిజిటల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రూ.1లక్ష నగదును అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి వస్తుండగా మామిడాల వద్ద విద్యార్థులను చూసి మంత్రి తన కాన్వాయ్‌ను నిలిపి వారితో మాట్లాడారు. ఏమి కావాలని ప్రశ్నించగా డిజిటల్, సైన్స్ ల్యాబ్ కావాలని కోరటంతో ప్రధానోపాధ్యాయుడిని పిలిపించి ఎంత ఖర్చు అవుతుందని అడిగారు. రూ.60వేలు అవుతుందని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విష్ణు సమాధానమివ్వటంతో వెంటనే రూ.1లక్ష నగదు అందజేసి డిజిటల్, సైన్స్ ల్యాబ్ ఏర్పాటుచేయాలని సూచించారు. పాఠశాలలో 9.5 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25వేల నగదు బహుమతితో పాటు, ఇంటర్ విద్యను చదివిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, డీఎస్‌వో వెంకటేష్, డీఎం గోపీకృష్ణ, డీసీవో పత్యానాయక్, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ముత్తినేని శ్యాంసుందర్, నాయకులు బద్ధం సుధీర్, ముత్తినేని నాగేశ్వర్‌రావు, బొల్లెద్దు అంబేడ్కర్, నాగరాణి, దాసరి జానయ్య, పుల్లభట్ల ప్రవీణ్ కుమార్, వనపర్తి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యాన్ని పెంచుకోవాలి

పీవోడబ్ల్యూ జాతీయ నేతలు సంధ్య, ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ నేత వి.సంధ్య

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు పోరాడే చైతన్యాన్ని మరింత పెంచుకోవాలని, స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించాలని పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, జి.ఝాన్సీ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర రాజకీయ తరగతులు జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. తొలుత అరుణ పతాకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ ఆవిష్కరించగా, మహిళా అమరులను స్మరిస్తూ సంతాప తీర్మానాన్ని అందే మంగ ప్రవేశపెట్టారు. అనంతరం శిక్షణ తరగతులను బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య, ఝాన్సీ మాట్లాడుతూ, ఐక్యతే మహిళల బలమని, సామాజిక అభివృద్ధికి ఐక్యంగా ఉద్యమించడం ఎంతో అవసరమన్నారు. మహిళా హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి నిర్వహించిన పోరాటంలో ప్రగతిశీల మహిళా సంఘం ముందుందన్నారు. ప్రపంచ మార్కెట్‌పై పెత్తనం కోసం అగ్రరాజ్యాలు యుద్ధాలను సృష్టిస్తున్నాయని అన్నారు. సనాతన ధర్మం పేరుతో మతఛాందసవాదులు మహిళలపై, పసి పిల్లలపై చేస్తున్న అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రపంచ యుద్ధాలు, వలసలు, మార్కెట్ విస్తరణ, వాణిజ్య పోటీ, అగ్ర రాజ్యాలు, సామ్రాజ్యవాద దేశాల తీరును వారు వివరించారు. శిక్షణాతరగతుల్లో హరిత, ఆర్.సీత, జ్యోతి, పద్మ,ఆదిలక్ష్మి, కె.జ్యోతి, ఉపేంద్ర, లక్ష్మి, భారతి, పాల్గొన్నారు.

నేటి బంద్‌కు సమాయత్తం

జిల్లాలో బైక్ ర్యాలీలు



నల్లగొండలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, చిత్రంలో గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా బంద్‌కు నాయకులు సమాయత్తమయ్యారు. ఈ నెల 18న బంద్ నేపథ్యంలో శుక్రవారం జిల్లాలో పలు రాజకీయ పార్టీలతో పాటు విద్యార్థి, బీసీ సంఘాలు ర్యాలీలు నిర్వహించాయి. బంద్‌కు సహకరించాలని కోరుతూ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలకు వెళ్లి బంద్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బంద్ సందర్భంగా స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య సంస్థలు మూసి వేసేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలోని పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. నల్లగొండలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో పాటు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ ద్వంద వైఖరిని ఖండిస్తూ రాజ్‌భవన్‌కు వెళ్లిన సీపీఎం నాయకులపై లాఠీచార్జ్ చేయడాన్ని నిరసించడంతో పాటు బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు బీజేపీ సంపూర్ణ మద్దతు : వర్షిత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ రూరల్): బీసీ సామాజిక న్యాయం కోసం చేపడుతున్న పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతు ఇస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగంవర్షిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ, ప్రజా సంఘాలు, బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ కార్యకర్తలు 18న నిర్వహించే బంద్‌లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్, దళిత సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడ్డ వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. సీజేపై దాడిచేసిన వ్యక్తిపై ఇప్పటి వరకు కేసు ఎందుకు నమోదు చేయలేదో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరినా కులరక్కసి వెంటాడుతూ అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సీజేపై దాడి, మొత్తం దళితుల ఆత్మగౌరవం మీద జరిగిన దాడి అని అన్నారు. దళితులు ఉన్నత స్థానాల్లో ఉండడాన్ని కొంతమంది కులోన్మాదులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. సీజేపై దాడి జరిగి 10 రోజులైనా కేసు నమోదు చేయకపోవడం, అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. సీజేపై దాడి జరిగిన కేసు విషయం ఇలా ఉంటే ఇక దేశంలో దళితుల పరిస్థితి ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతోందనన్నారు. ఇప్పటికైనా సీజేపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించి, దీని వెనక ఉన్న శక్తులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో న్యాయం చేసేంతవరకు పోరాటం ఆగదని, ఈనెల 27న హైదరాబాద్‌లో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించి తాడోపేడో తేల్చుకుంటామన్నారు. అనంతరం తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కారుపాటి అంబేడ్కర్, బట్ట శ్రీను, మాచర్ల ప్రతాప్, బట్ట చిన్న సైదులు, తాటిపాముల జానయ్య, తాటిపాముల నరసింహ, బట్ట లింగప్రసాద్, బట్ట సాయి, మాగి వెంకటేష్, మాచర్ల ముత్తయ్య, బోడ యాకోబు, బట్ట శివభిక్షం, వేముల సాయి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి



నూలగడ్డ కొత్తపల్లి గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సౌలభ్యం కోసం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నూలగడ్డ కొత్తపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం పూర్తిగా ఎండి, తేమశాతం తగ్గాకే రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. నాణ్యతాప్రమాణాల మేరకు ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, ఏపీఎం పోలేపల్లి శంకర్, నాయకులు గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, సంకటి లింగయ్య, సమభావన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు సాగర్‌కు ఏపీ రాష్ట్ర గవర్నర్

సాగర్‌లో రెండు రోజులపాటు విడిది

నాగార్జునకొండను సందర్శించనున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

7

కళాకారుల కృషి అభినందనీయం

చింతపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యం చేయడంలో కళాకారుల కృషి అభినందనీయమని సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో పలువురు కళాకారులకు అవార్డులు ప్రదానంచేశారు. ఇందులో భాగంగా చింతపల్లి మండలంలోని గొల్లపల్లి మాజీ సర్పంచ్ బాణాల రంగాచారికి దైవజ్ఞ శర్మ అవార్డును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వకులాభారణం కృష్ణమోహన్‌రావు, శాంతికృష్ణ పాల్గొన్నారు.

సమాజసేవలోనూ పాలుపంచుకోవాలి

దేవరకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలోనూ పాలుపంచుకోవాలని దేవరకొండ ఎంపీడీవో డానియెల్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 కొండభీమనపల్లి గ్రామంలో ప్రత్యేక శీతాకాల శిబిరం ఏర్పాటుచేసి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత, ఓటు హక్కు, సమాజసేవపై తమ బాధ్యతను గుర్తు చేశారు.

అధ్వాన దారి.. ప్రయాణం ఆగమాగం

● పాములపాడు-భీమవరం గ్రామాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు ● పట్టించుకోని అధికారులు.. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మాడ్గులపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మాడ్గులపల్లి మండలంలో అధ్వాన రహదారులపై ఆగమాగ ప్రయాణం చేయాల్సి వస్తోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాములపాడు గ్రామం నుంచి కేతేపల్లి మండలం భీమవరం వరకు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. కంకరతేలి ఉండడంతో పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రోడ్డును నిర్మించినా, కొద్ది రోజులకే రోడ్డు గుంతలు ఏర్పడడంతో ఈ రహదారిని పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో గ్రామస్థులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ప్రయాణం సాగించలేని పరిస్థితి నెలకొంది. గ్రామస్థులు, విద్యార్థులు ఈ రహదారి మీదుగా ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు. ఆటోలు సైతం ఇటువైపు రాకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో రోడ్లు బాగు చేస్తామని చెప్తున్నా ఆ తర్వాత పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం చేయలేకపోతున్నాం

కేశవాపురం, చెర్వుపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డు వర్షాలకు తెగిపోవడంతో చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వరికోతలు మొదలవడంతో ట్రాక్టర్లు ఈ దారి గుండా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో చుట్టూ తిప్పర్తి తిరిగి వెళ్లాల్సి వస్తుంది.

● కనగంటి యాదగిరిరెడ్డి (కేశవాపురం)

టెండర్ దశలో ఉంది

మాడ్గులపల్లి మండలం పాములపాడు-భీమవరం రోడ్డు టెండర్ దశలో ఉంది. ఈ రోడ్డుకు ప్రభుత్వం ఎంఆర్ఆర్‌లో భాగంగా రూ.1.60కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్ పూర్తవగానే పనులను ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. చెర్వుపల్లి, కేశవాపురం గ్రామాల మధ్య రోడ్డునూ బాగు చేస్తాం.

● మధు, పీఆర్ ఏఈ

రెండు జిల్లాలకు ఈ రోడ్డే ప్రధానం

మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు, భీమవరం నాలుగు కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు అనుసంధానంగా ఉండడంతో వాహనదారులు సూర్యాపేట నుంచి నల్లగొండకు పనుల నిమిత్తం ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి ఉంది. మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం, తోపుచర్ల, మాడ్గులపల్లి, ఆగామోత్కూర్, ఇందుగుల, కల్వలపాలెం, భీమనపల్లి, చర్లగూడెం, పోరెడ్డిగూడెం, చిరుమర్తి గ్రామాలతోపాటు తిప్పర్తి మండలంలోని సర్వారం, ఎల్లమ్మగూడెం, గోదారిగూడెం గ్రామాల ప్రజలు సూర్యాపేటలోని వివిధ కంపెనీల్లో పనుల కోసం నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎంతో మంది ప్రజలు పాములపాడు, కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి, ఉప్పలపాడు, కొప్పోలు, సూర్యాపేట జిల్లాలోని టేకుమట్ల, రాయినిగూడెం 65వ జాతీయ రహదారిపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూర భారం పెరిగిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మాడ్గులపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు సూర్యాపేట జిల్లాలోని కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి వస్తుంది. సూర్యాపేట జిల్లా ప్రజలు నల్లగొండకు వెళ్లాలంటే ఈ రోడ్డుగుండానే వెళ్లాలి. ఈ రోడ్డు గుంతలమయంగా ప్రమాదకరంగా ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు సూర్యాపేట, రాయినిగూడెం, టేకుమట్ల, కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్ నుంచి ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో తమకు దూర భార ప్రయాణం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





గుంతలమయంగా మారిన భీమవరం- సూర్యాపేట రహదారి, (ఇన్‌సెట్‌లో) అసంపూర్తిగా వదిలివేసిన కల్వర్టు నిర్మాణ పనులు

మండలానికి వెళ్లాలంటే.. ఈ దారే ప్రధానం

మాడ్గులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామస్థులు మండలకేంద్రానికి వెళ్లాలంటే ఈ రోడ్డే ప్రధానం. చెర్వుపల్లి, కేశాపురం గ్రామాల మధ్య ఉన్న ఏటి వాగుపై ఉన్న రోడ్డు తెగిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది.

ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ వంట నూనెలు, వంట గింజల పథక ప్రచారంలో ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినట్లు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ 60శాతం భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా అమలవుతున్న నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ సీడ్స్(ఎన్ఎంఈవో-ఓఎస్) పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకంలా ప్రచారం చేసుకుంటోందన్నారు. పథకంపై జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలలో రాష్ట్ర ప్రభుత్వ ఫొటోలు, గుర్తులు, నాయకుల చిత్రాలను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. సింహభాగం కేంద్ర వ్యవసాయ శాఖ నిధులతో అమలవుతున్న ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం తక్షణమే ఆపాలని, ఆయా ప్రచార, అవగాహన వాహనాలపై ప్రధాని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రుల ఫొటోలు తప్పనిసరిగా ముద్రించాలన్నారు. ప్రొటోకాల్ పాటించని జిల్లా వ్యవసాయ శాఖాధికారి, దేవరకొండ, హాలియా, మునుగోడు, నకిరేకల్ వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రవణ్‌కుమార్

దేవరకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులందరూ కపాస్ కిసాన్ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ కోరారు. శుక్రవారం దేవరకొండ మండలం ఇద్దంపల్లిలో పత్తిపంటను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవరకొండలో విలేకరులతో మాట్లాడారు. పత్తి పంట పండించిన రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా నమోదు చేసుకొని తామే స్వయంగా సీసీఐకి మద్దతు ధరకు విక్రయించుకోవచ్చన్నారు. పత్తి రైతులందరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని మద్దతు ధర పొందాలని, మరింత సమాచారం కోసం వ్యవసాయశాఖ అధికారులను కలిసి వారి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమావేశంలో దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ, ఏవో రవికుమార్, ఏఈవో అభిలాష్, బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

గుర్రంపోడు: పత్తి రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని గుర్రంపోడు మండల వ్యవసాయశాఖ అధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొల్లారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న తర్వాతే సంబంధిత మిల్లులకు పత్తిని విక్రయానికి తేవాలన్నారు. రైతులు తమ ఫోన్ నెంబర్లు మార్చుకోవాలంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జితేందర్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పెద్దవూర: మండలకేంద్రంలో పత్తి రైతులకు శుక్రవారం ఏఈవో ఆంజనేయులు కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని బీఆర్ఎస్‌నేత వడ్త్య రమేష్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అజ్మపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాళికా మాతా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కాళికమాత దయ అందరిపై ఉండాలన్నారు.

డీసీసీ పదవిపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నా, ప్రధానంగా నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య, పీసీసీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత, పీసీసీ ప్రధానకార్యదర్శులు దైద రవీందర్, చనగాని దయాకర్‌గౌడ్, తదితర నేతలు పోటీపడుతున్నారు.

ఎస్సీ వర్గానికి కేటాయిస్తే కొండేటికి ఛాన్స్

డీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తూ పీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవిని ఎస్సీలకే కేటాయించాలని అధిష్ఠానం భావిస్తే పదవి మల్లయ్యకు దక్కే అవకాశం ఉంది. 20 ఏళ్లగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేయడంతో పాటు, గత ఎన్నికలకు ముందు నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించిన నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. జడ్పీటీసీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు సైతం కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేకపోయిన సందర్భంలో రానున్న రోజుల్లో తత్సమాన పదవి ఇస్తామని అధిష్ఠానం ఇచ్చిన హామీని నెరవేర్చాలని మల్లయ్య ఏఐసీసీ పరిశీలకులను, జిల్లా కీలక నేతలను కోరారు.

బీసీ కోటాలో యువ నేతల తీవ్ర ప్రయత్నాలు

నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవికి తమ పేర్లను పరిశీలించాలని యువ బీసీ నేతలు దరఖాస్తు చేసుకొని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రధానంగా ప్రస్తుత పీసీసీ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్న పున్నా కైలాష్‌నేత, పీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరిలో పున్నా కైలాష్ కాంగ్రెస్‌లో విద్యార్థి దశ నుంచి పనిచేయడమే గాక, తెలంగాణ ఉద్యమనేతగా, ఓయూ జేఏసీ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన 2018, 2022 2023 ఎన్నికల్లోనూ మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి, 2024 ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థిగా టిక్కెట్ ఆశించినా సమీకరణాల్లో ఛాన్స్ దక్కలేదు. ఆ సందర్భంలో అధిష్ఠానం భవిష్యత్‌లో కీలకమైన అవకాశం ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ డీసీసీ పదవి ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరో బీసీ యువనేత చనగాని దయాకర్‌గౌడ్ ఓయూ జేఏసీ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పనిచేశారు. నిరుద్యోగ జేఏసీ నాయకుడిగా పలు ఆందోళనలు నిర్వహించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా, పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న దయాకర్‌గౌడ్ డీసీసీ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. నల్లగొండ డీసీసీ అధ్యక్ష పదవిని గతంలోనూ గౌడ సామాజికవర్గనేతలకు ఇచ్చారని, సమర్థంగా పార్టీకి వారు సేవలందించారని, అదే ఒరవడిలో ఈ దఫా తనకు అవకాశం ఇవ్వాలని దయాకర్ తన వాదనను అధిష్ఠానం ముందుంచారు. మరి అధిష్ఠానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో చూడాల్సిందే.

సీజేఐపై దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు దైద సత్యం ● తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన



మిర్యాలగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీజేఐ బీఆర్ గవాయ్‌పై దాడి సరికాదని, ఈ దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు దైద సత్యం డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడైన గవాయ్ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం జీర్ణించుకోలేని ఆధిపత్య శక్తులు కుట్రతో ఆయనపై దాడికి తెగబడ్డాయన్నారు. సిట్టింగ్ జడ్జిలతో దర్యాప్తు చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎడ్ల రమేష్, పెరుమాళ్ల కుమారి, అహ్మద్‌ఖాన్, తరంగి శ్యామ్, దైద వెంకన్న, సురేందర్, ఉబ్బపల్లి ఎల్లయ్య, నూకపంగ మోహన్ శరత్, నాయకులు పాల్గొన్నారు.

హాలియా: సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గడుసు సైదీష్ మాదిగ అన్నారు. శుక్రవారం మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గార్లపాటి ప్రసాద్‌మాదిగ, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, కొండలు, వెంకన్న, సైదయ్య, రాజశేఖర్, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వేములపల్లి: సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయనేత పుట్టల సందీప్ మాదిగ అన్నారు. తహసీల్దార్ హేమలతకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఇరుగు మల్లయ్య, మండల నాయకులు వల్లపుదాసు నాగయ్య, ప్రసాద్, నాగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సందీప్

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దేవరకొండ సందీప్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని 15 మంది విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, చైతన్య, రజిత, రాజేష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి'

చింతపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీఆర్ఆర్ఎస్ రాష్ట్రనేత కంకణాల వెంకట్‌రెడ్డి ప్రవీణ అన్నారు. మండలంలోని నర్సర్లపల్లికి చెందిన మాజీ సర్పంచి పున్‌రెడ్డి సుమతిరెడ్డి అత్తమ్మ ప్రమీలమ్మ దశదిన కర్మలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోనగంటి గోవర్ధన్‌చారి, మేకల వెంకటయ్య, పంబల వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

చింతపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎర్ర రవి 11వ వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపానికి పూల మాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంకోసం రవి చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్గనైజర్ సెక్రటరీ శంషొద్దీన్, ఎర్ర చిన్న, కోటేష్, మురళి, కిరణ్, మహేష్, భవ్య, మనీషా, తదితరులు పాల్గొన్నారు.

జామా మసీద్ నూతన కమిటీ



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

చింతపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) జామా మసీద్ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.షాహేద్, ఉపాధ్యక్షుడిగా ఎం.రషీద్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అస్లాం, కార్యదర్శిగా అబ్దుల్ సమ్మద్, కోశాధికారిగా ఎండీహాజీ, కార్యవర్గ సభ్యులుగా ఎం.రహీంఖాన్, ఎస్‌కే.షుకుర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారమే జనహిత మార్నింగ్‌వాక్ లక్ష్యం



సంతకాల సేకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

● దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే జనహిత ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం జటావత్‌తండా, కొర్రతండాలలో జనహిత ఎమ్మెల్యే మార్నింగ్‌వాక్ కార్యక్రమాన్ని అధికారులు, కాంగ్రెస్ నేతలతో కలిసి నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జటావత్‌తండా, కొర్రతండాలలో పర్యటించి సమస్యలను తెలుసుకొని అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మార్నింగ్‌వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్‌కు తండావాసులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నగేష్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, దొంతినేని వెంకటేశ్వరరావు, బిక్కునాయక్, జీవన్‌రెడ్డి, రాంసింగ్, లక్ష్మణ్‌నాయక్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే నివాసంలో దేవరకొండ మండలం ఇద్దంపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వారికి పార్టీ కండువా కప్పి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, మల్‌రెడ్డి శ్రీలత రవీందర్‌రెడ్డి, రాజశేఖర్, చుక్క వెంకటయ్య, ప్రశాంత్, కొర్ర రాంసింగ్, వైఎస్ కర్నాకర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే అధికారంలోకి బీజేపీ

ఓటు చోరీ పద్ధతిలోనే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడు సార్లు అధికారంలోకి వచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ విమర్శించారు. శుక్రవారం దేవరకొండ మండలం కొర్రతండాలో ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఓటు చోరీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఓటు చోరీపై సంతకాల సేకరణను ఉద్యమంగా చేపట్టాలన్నారు. ఓటు చోరీపై జరుగుతున్న అవకతవకలు, ఓట్ల తొలగింపు, తదితర అంశాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు.

బంద్‌కు రాజకీయ పార్టీల సమాయత్తం



మిర్యాలగూడలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నేత నాగార్జునాచారి

మిర్యాలగూడ, మిర్యాలగూడటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, వివిధ బీసీ సంఘాలు శనివారం తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ తమ కార్యవర్గాలతో సమావేశాలు నిర్వహించాయి. బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రనేత అన్నభీమోజు నాగార్జునాచారి మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బంద్ సందర్భంగా శనివారం ఉదయం 8 గంటలకు కార్యకర్తలతో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీలంతా ఐక్యంగా కదిలి బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మట్టపల్లి సైదులు, చిర్రమల్లయ్య, బాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎండీ షోయబ్, ఈశ్వరాచారి, పందిరి వేణు, దోనేటి సైదులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ద్వంద వైఖరిని నిరసిస్తూ శనివారం తలపెట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ వన్, టౌన్ టౌన్ కార్యదర్శులు మల్లుగౌతం రెడ్డి, భవాండ్ల పాండు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు వ్యాపార, విద్యాసంస్థలు, పెట్రోల్‌బంక్‌ల యజమానులు, రైస్‌మిల్లర్లు, ఆర్టీసీ స్వచ్ఛందంగా సంస్థలను మూసివేసి బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపాలని కోరారు. సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, దేవీరాం నాయక్, వాడపల్లి రమేష్, గోవర్ధనా, పల్లా బిక్షం, బ్రహ్మచారీ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి: రాష్ట్రవ్యాప్త బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లి పాల శీతలీకరణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో కాసర్ల వవెంకటేశ్వర్లు, మాడ్గుల యాదగిరి, బూడిద వెంకటేష్‌యాదవ్, ఎంఏ.కైసర్‌ఖాన్, బొడిగె శంకర్, నందీశ్వర్ పాల్గొన్నారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

చింతపలి: బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్తాల శేఖర్, బీసీనేత బాదేపల్లి పులిరాజ్ గౌడ్ కోరారు. శుక్రవారం చింతపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. బీసీలు రాజకీయంగా ఎదగడానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అయితమోని ధన్‌రాజ్, శ్రీశైలం, వెంకటయ్య పాల్గొన్నారు.

దామరచర్ల: రాష్ట్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మండల కార్యదర్శి మాలోతు వినోద్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్రం అడ్డుపడుతుందన్నారు. కార్యక్రమంలో పాపానాయక్, దయానంద్, శ్రీను, వెంకటయ్య, దుర్గయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాడ్గులపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చే నెల 15 వరకు నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించగా 120 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మల్లిఖార్జున్ పాల్గొని పశువైద్య శిబిరాన్ని పర్యవేక్షించి రైతులకు సూచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీలత, జయమ్మ, రాకేష్, రైతులు కొండ జానయ్య, హరీష్‌రెడ్డి, సింగం పర్వతాలు, లింగస్వామి, రమేష్, రాజు పాల్గొన్నారు.



పశువులకు చికిత్స అందిస్తున్న పశువైద్యుడు వినయ్‌కుమార్